# నగరంలో డబుల్ మర్డర్ కలకలం



- **అన్న వదినలను దారుణంగా హతమార్చిన వ్యక్తి**

**బలగం టీవీ, హైదరాబాద్**

నగరంలోని ఓల్డ్ సిటీ మీర్‌చౌక్ పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణమైన డబుల్ మర్డర్ ఘటన చోటుచేసుకుంది. కుటుంబ అంతర్గత విభేదాల నేపథ్యంలో సొంత అన్న, వదినలను తమ్ముడే కిరాతకంగా హత్య చేయడం స్థానికంగా తీవ్ర సంచలనం సృష్టించింది.

వివరాల్లోకి వెళ్తే.. సుల్తాన్‌పురా ప్రాంతానికి చెందిన ఆదిల్ ఖాన్ తన అన్న అఖీల్ ఖాన్, వదిన అజ్మేరీ బేగంతో కొంతకాలంగా వ్యక్తిగత విభేదాలతో గొడవ పడుతున్నాడు. సోమవారం ఈ ఘర్షణ తారస్థాయికి చేరడంతో ఆగ్రహానికి లోనైన ఆదిల్ ఖాన్, వారిద్దరినీ దారుణంగా హత్య చేశాడు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. ఘటనా స్థలాన్ని ఏసీపీ జి. శ్యాంసుందర్, సీఐ ఎం. కొండలరావు సందర్శించారు. హత్యకు గల అసలు కారణాలపై పోలీసులు అన్ని కోణాల్లో విచారణ జరుపుతున్నారు. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం. ఈ జంట హత్యలతో సుల్తాన్‌పురా, మిర్‌చౌక్ పరిసరాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ముందస్తు జాగ్రత్తగా పోలీసులు ఆయా ప్రాంతాల్లో అదనపు బలగాలను మోహరించారు.

# కాంట్రాక్ట్ కార్మికులకు అమలు కాని కార్మిక చట్టాలు

- **ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ**

**బలగం టీవీ, హైదరాబాద్**

జీహెచ్ఎంసీలో పని చేస్తున్న దాదాపు 50 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాలు కార్మిక చట్టాలు అమలు కాక పోవటం తీవ్ర అన్యాయమని ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ విమర్శించారు. సోమవారం జీహెచ్ఎంసీ కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో ట్యాంక్ బండ్ వద్ద ఉన్న జీహెచ్ఎంసి ప్రధాన కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు.ఈ ధర్నాకు హాజరైన ఆయన మాట్లా డుతూ ఆరేండ్ల క్రితం జీహెచ్ఎంసీ ఎన్నికలకు ముందు కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు పెంచారని, నాటి నుంచి నేటి వరకు మళ్లీ పెంచకపోవడంతో కాంట్రాక్ట్ కార్మికులు పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలను తట్టుకోలేక, ఇంటికిరాయిలు, పిల్లల ఫీజులకు వస్తున్న వేతనం ఏమాత్రం సరిపోక తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని తెలిపారు. తక్షణం వీరి వేతనం రూ.26 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు.కాంట్రాక్ట్ చట్టం ప్రకారం నాలుగు పండగ సెలవులు, నాలుగు జాతీయ సెలవులు, 20 రోజుల పనికి ఒకరోజు వేతనంతో కూడిన ఆర్జిత సెలవు మొత్తం సంవత్సరానికి 23 లీవులు అమలు చేయాల్సి ఉన్నా వాటిని కూడా అమలు చేయకపోవడం అన్యాయమని పేర్కొన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో ప్రజానీకం సంఖ్య, బిల్డింగుల సంఖ్య రోజు రోజుకు పెరుగుతున్నప్పటికీ అందుకు అనుగుణంగా కార్మికుల సంఖ్యను పెంచకపోవడం వల్ల ఉన్న వారిపై పని భారం పడుతున్నదని, చనిపోయిన కార్మికుల స్థానంలో కూడా వారి కుటుంబీకుల్ని తీసుకోకుండా తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారని తెలిపారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పి.వెంకటయ్య మాట్లాడుతూ ఎంటమాలజీ విభాగంలో పనిచేస్తున్న కార్మికులకు ఎండల దృష్ట్యా పని గంటలను తగ్గించాలని, కరోనా సమయంలో నియమితులైన ఎంటమాలజీ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు, పీఎఫ్‌లను వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు.జీహెచ్ఎంసిలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు సంవత్సరానికి 23 లీవులు ఇచ్చేందుకు, ప్రమాదవశాత్తు మరణించిన కార్మికులకు ఎస్బిఐ




ద్వారా రూ.30 లక్షల ఇన్సూరెన్స్ ఇచ్చేందుకు, కార్మికుల జీతాలు పెంపునకు ప్రభు త్వం దృష్టికి తీసుకుపోయేందుకు జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి కర్ణన్ హామీ ఇచ్చినట్టు తెలిపారు.ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసి కాంటాక్ట్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి బొడ్డుపల్లి కిషన్, ఉప ప్రధాన కార్యదర్శి జి. నర్సయ్య, కార్మికులు ఎల్.రవికుమార్, విశ్వ ప్రసాద్, సత్తార్, భూమేష్, సత్య, కొండల్, విక్రమ్, పరశురాం, కళ్యాణ్, ధర్మ పురి, స్వప్న, మహబూబా, సోమయ్య, సోమనాథ్, ఇంద్ర, శ్రీను, ఉపేందర్, బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.



# జపాన్‌లో భారీ భూకంపం.. సునామీ ముప్పు!

- **రిక్టరు స్కేలుపై 7.4 తీవ్రత.. తీర ప్రాంతాలకు అత్యవసర హెచ్చరికలు**
- **3 మీటర్ల ఎత్తున ఎగసిపడనున్న అలలు.. బుల్లెట్ రైళ్ల నిలిపివేత.. భారత్‌కు లేదు ప్రమాదం**

**బలగం టీవీ, టోక్యో**

వరుస ప్రకృతి వైపరీత్యాలతో అల్లాడుతున్న జపాన్‌ను మరోసారి భారీ భూకంపం వణికించింది. జపాన్ ఉత్తర తీర ప్రాంతంలో సోమవారం సాయంత్రం సంభవించిన ఈ భూకంప తీవ్రత రిక్టరు స్కేలుపై 7.4గా నమోదైంది. దీంతో సముద్ర మట్టం భారీగా పెరిగే అవకాశం ఉండటంతో జపాన్ మెట్రోలాజికల్ ఏజెన్సీ తీర ప్రాంతాలకు 'సునామీ' హెచ్చరికలు జారీ చేసింది. పౌరులు వెంటనే సురక్షితమైన, ఎత్తైన ప్రదేశాలకు వెళ్లాలని అధికారులు అల్టిమేటం జారీ చేశారు.

**సముద్ర గర్భంలో కంపనం:**

స్థానిక కాలమానం ప్రకారం సాయంత్రం 4.54 గంటలకు ఉత్తర జపాన్‌లోని సన్రికు ప్రాంతంలో భూమి కంపించింది. పసిఫిక్ మహాసముద్రంలో సుమారు 10 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రం ఉన్నట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు. భూకంపం ధాటికి హొక్కైడో, ఆఓమోరి, ఇవాటే ప్రాంతాలు తీవ్రంగా ప్రభావితమయ్యాయి. హొక్కైడో తీరంలో సుమారు 3 మీటర్ల (10 అడుగులు) ఎత్తున అలలు ఎగసిపడే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

**స్తంభించిన రవాణా.. రేవుల ఖాళీ:**

భూకంపం సంభవించిన వెంటనే అప్రమత్తమైన ప్రభుత్వం రవాణా వ్యవస్థను నిలిపివేసింది. టోక్యో నుంచి ఆఓమోరి వరకు నడిచే బుల్లెట్ రైలు సేవలను తాత్కాలికంగా రద్దు చేశారు. తోహోకు ప్రాంతంలోని కీలకమైన 'హచినోహే పోర్ట్' నుంచి నౌకలు వెంటనే దూరంగా వెళ్లాలని అత్యవసర ఆదేశాలు జారీ అయ్యాయి. పారిశ్రామిక, వాణిజ్య కార్యకలాపాలు నిలిచిపోవడంతో తీర ప్రాంతం వెలవెలబోతోంది. తదుపరి ఆదేశాలు వచ్చే వరకు సముద్ర తీరాలకు ఎవరూ రావొద్దని హెచ్చరికలు జారీ చేశారు.

**భారత్‌కు తప్పిన ముప్పు:**

జపాన్‌లో సునామీ హెచ్చరికల నేపథ్యంలో భారత ఉపఖండంపై దాని ప్రభావం ఎలా ఉంటుందనే ఆందోళన వ్యక్తమైంది. దీనిపై స్పందించిన ఇండియన్ నేషనల్ సెంటర్ ఫర్ ఓషన్ ఇన్ఫర్మేషన్ సర్వీసెస్.. భారత్‌కు ఎలాంటి ప్రమాదం లేదని స్పష్టం చేసింది. సునామీ ఏర్పడిన కేంద్రం నుంచి కేవలం 300 కిలోమీటర్ల పరిధిలోనే దాని ప్రభావం ఉంటుందని, మన దేశానికి ఎటువంటి ముప్పు ఉండబోదని వెల్లడించింది. పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని, అవసరమైతే ముందస్తు సమాచారం ఇస్తామని పేర్కొంది. జపాన్‌లోని అణు విద్యుత్ కేంద్రాల వద్ద భద్రతను అధికారులు సమీక్షిస్తున్నారు. ఇప్పటివరకు అందిన సమాచారం ప్రకారం ఎక్కడా ప్రాణ నష్టం సంభవించలేదు, అయితే ఆస్తి నష్టంపై అంచనా వేయాల్సి ఉంది.



# ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- **ట్రేడ్ యూనియన్ నాయకులు**

**బలగం టీవీ, హైదరాబాద్**

ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, సమ్మె చేసే సంఘాలతో చర్చలు జరపాలని ట్రేడ్ యూనియన్ నాయకులు అన్నారు. టీఎస్ఆర్టీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ హైదరాబాద్ రీజినల్ కమిటీ ఆధ్వర్యంలో సీఐటీయూ నగర కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఎస్‌డబ్ల్యూఎఫ్ కార్యదర్శి వి లింగయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సెంట్రల్ సిటీ జిల్లా అధ్యక్షులు దశరథ్ మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, సమ్మె నివారణ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆర్టీసీ సంఘాల పైన ఉన్న ఆంక్షలు తక్షణం ఎత్తివేయాలన్నారు. మహాలక్ష్మి స్కీం అనంతరం విపరీతమైన పనిభారంతో కష్టపడుతున్న ఆర్టీసీ కార్మికుల పట్ల ప్రభుత్వం శత్రు వైఖరితో వ్యవహరించడం సరికాదన్నారు. ప్రభుత్వం సమ్మె విచ్ఛిన్నకర చర్యలు చేయకుండా వెంటనే ఆర్టీసీ సంఘాలను ఆహ్వానించి వారి డిమాండ్లపై చర్చించాలని డిమాండ్ చేశారు. టీఎస్ఆర్టీసీఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి పి రవీందర్ రెడ్డి మాట్లాడుతూవిద్యుత్ బస్సుల పేరుతో గ్రేటర్ హైదరాబాద్ జోన్ నుంచి ఇతర ప్రాంతాలకు బదిలీలు చేయాలనే నిర్ణయాన్ని వెంటనే విరమించుకోవాలని కోరారు. ఆర్టీసీ సంఘాల ఆరు సంఘాల జేఏసీ సమ్మె పోరాటానికి ఎస్‌డబ్ల్యూఎఫ్ మద్దతు తెలుపుతున్నదని, సమ్మెకు మద్దతుగా అన్ని డిపోల ముందు నిరసన బ్యాడ్జీలు ధరించాలని తెలిపారు. ప్రభుత్వం వెంటనే సమస్యలను పరిష్కరించి సమ్మెను విరమింపజేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఏఐఆర్‌టిడబ్ల్యూఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అజయ్ బాబు, టీయూసీఐ నగర కార్యదర్శి ప్రదీప్, కేవీపీఎస్ నగర కార్యదర్శి మహేందర్, బ్యాంక్ ఎంప్లాయిస్ నాయకుడు వి. కామేష్ బాబు, నగర హమాలీ యూనియన్ అధ్యక్షుడు నరేష్, ప్రజానాట్య మండలి నగర కార్యదర్శి మారన్న, ఎన్‌పీఆర్‌డీ నాయకుడు ఆర్. వెంకటేష్, సినిమా థియేటర్స్ వర్కర్స్ యూనియన్ నాయకుడు పి. పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల ఆత్మహత్యలను నిలువరించండి

- **ఎంపీ ఆర్.కృష్ణయ్య**

**బలగం టీవీ, హైదరాబాద్**



ఫీజు బకాయిలను ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో కాలేజీ యాజ మాన్యాల వేధింపులను తట్టుకోలేక విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతు న్నారని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ, ఆర్. కృష్ణయ్య సోమవారం ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న దాదాపు 18 లక్షల మంది బీసీ విద్యార్థుల ఫీజు బకాయిలను వెంటనే చెల్లించ ాలని డిమాండ్ చేశారు. శ్రీ ఇందు ఇంజినీరింగ్ కాలేజీకి చెందిన బీటెక్ విద్యార్థి ప్రణీత్ యాజమాన్యం చేసిన అవమానాన్ని భరించలేక ఆత్మహత్యకు పాల్పడ్డా డనీ వాపోయారు. ఇది చాలా దారుణమని, పాలకుల అసమర్థత ఒక పేద విద్యార్థి జీవితాన్ని బలి తీసుకుందని చెప్పారు. గత 30 నెలల కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో 8మంది విద్యార్థులు బలవన్మరణానికి పాల్పడ్డారని, సక్రమంగా ఫీజు రీయింబర్స్ మెంట్ నిధులు బడ్జెట్ విడుదల చేయకపోవడమే ఇందుకు ప్రధాన కారణమన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయక పోవడం వల్ల రాష్ట్రంలోని దాదాపు 18 లక్షల మంది కాలేజీ విద్యార్థులు యాజమాన్యాల కారణంగా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం ఫీజు బకాయిలు ఇవ్వకపోవడం వల్ల విద్యార్థులే వాటిని కట్టాలని కాలేజీ యాజమాన్యాలు ఒత్తిడి తెస్తున్నాయనీ, కోర్సు పూర్తయిన వారికి సర్టిఫికెట్లు ఇవ్వడం లేదనీ, పరీక్షా సమయంలో హాల్ టికెట్లు ఇవ్వకపోగా, ఉద్యోగాలు వచ్చినవారికి సర్టిఫికెట్లు ఇవ్వడం లేదనీ వివరించారు. కొంతమంది అప్పులు చేసి ఫీజులు కట్టి సర్టిఫికెట్లు తీసుకుంటున్నారనీ, సర్టిఫికెట్లు తీసుకోలేక ఉద్యోగాలు కోల్పోతున్నవారు, పీజీ కోర్సులలో అడ్మిషన్ తీసుకోలేని వారు ఆత్మహత్యలు చేసుకోవలసిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. బలహీన వర్గాల పట్ల పాలకులు వివక్షత చూపడమే ఈ దుస్థితికి కారణమన్నారు. ఇకనైనా బీసీ వ్యతిరేక చర్యలకు స్వస్తి చెప్పాలని సూచించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని తక్షణమే పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్ మెంట్ నిధులను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

# హర్మూజ్ అంతర్జాతీయ జలమార్గం: చైనా

**వెంటనే నౌకల రాకపోకలకు తెరవాలి.. షీ జిన్‌పింగ్ కీలక వ్యాఖ్యలు**

**అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతలపై డ్రాగన్ ఆందోళన.. భారత్ నౌకలపై కాల్పుల ఘటనపై స్పందన**

**బలగం టీవీ, బీజింగ్**



ప్రపంచ దేశాల వాణిజ్యానికి జీవనాడి వంటి హర్మూజ్ జలసంధిపై నెలకొన్న ఉద్రిక్తతలపై చైనా కీలక వ్యాఖ్యలు చేసింది. హర్మూజ్ జలసంధిని అంతర్జాతీయ జలమార్గంగా అభివర్ణించిన చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, దీనిని తక్షణమే సాధారణ నౌకాయానానికి తెరవాలని డిమాండ్ చేశారు. సౌదీ అరేబియా రాజు ప్రిన్స్ మహమ్మద్ బిన్ సల్మాన్‌తో జరిపిన ఫోన్ సంభాషణలో జిన్‌పింగ్ ఈ అంశాన్ని ప్రస్తావించారు. జలసంధి మూసివేత వల్ల ప్రాంతీయ దేశాలతో పాటు అంతర్జాతీయ సమాజ ప్రయోజనాలు దెబ్బతింటాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

ఇరాన్ ఓడరేవులను అమెరికా దిగ్బంధించడం, దానికి ప్రతిచర్యగా ఇరాన్ జలసంధిని మూసివేయడంతో పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయి. ఈ క్రమంలో, అమెరికా దిగ్బంధనాన్ని ధిక్కరిస్తూ చైనా నుండి ఇరాన్ వైపు వెళ్తున్న సరుకు రవాణా నౌకపై అమెరికా నేవీ కాల్పులు జరపడాన్ని చైనా తీవ్రంగా ఖండించింది. ఇరు దేశాలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, కాల్పుల విరమణకు కట్టుబడి ఉండాలని చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి గ్వో జియాకున్ సూచించారు. ఘర్షణలను రెచ్చగొట్టడం వల్ల ఇంధన సంక్షోభం మరింత ముదురుతుందని హెచ్చరించారు.

హర్మూజ్ జలసంధిలో భారత జెండా ఉన్న వాణిజ్య నౌకలపై ఇరాన్ భద్రతా దళాలు కాల్పులు జరపడం పట్ల కూడా చైనా స్పందించింది. జలసంధిలో పరిస్థితి మరింత దిగజారకుండా నిరోధించడానికి అన్ని పక్షాలు సంయమనం పాటించాలని గ్వో జియాకున్ కోరారు. ఉద్రిక్తతలను తగ్గించడానికి అంతర్జాతీయ సమాజంతో కలిసి పనిచేయడానికి చైనా సిద్ధంగా ఉందని తెలిపారు. ఇరాన్ చమురును భారీగా దిగుమతి చేసుకునే ఆసియా దేశాలకు, ముఖ్యంగా చైనాకు ఈ ఇంధన కొరత పెను సవాలుగా మారింది.

హర్మూజ్ జలసంధి వద్ద ప్రస్తుతం యుద్ధ వాతావరణం తారస్థాయికి చేరుకుంది. తొలుత లెబనాన్ ఒప్పందంతో జలసంధిని తెరుస్తామని ఇరాన్ ప్రకటించినప్పటికీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్ నౌకలపై దిగ్బంధనాన్ని కొనసాగిస్తామని ప్రకటించడంతో పరిస్థితి మళ్ళీ మొదటికి వచ్చింది. ప్రతీకారంగా ఇరాన్ ఈ మార్గాన్ని పూర్తిగా మూసివేసి, అటుగా వచ్చే ఏ నౌకనైనా లక్ష్యంగా చేసుకుంటామని హెచ్చరించింది. శనివారం భారత నౌకలపై జరిగిన దాడులు ఈ ఉద్రిక్తతలకు నిదర్శనంగా నిలిచాయి.

ప్రపంచ చమురు సరఫరాలో ఐదో వంతు ఈ మార్గం గుండానే జరుగుతుండటంతో, ఈ సంక్షోభం ప్రపంచవ్యాప్తంగా ఇంధన ధరల పెరుగుదలకు మరియు ఆర్థిక మాంద్యానికి దారితీస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.



# జీహెచ్ఎంసీలో ప్రజావాణికి 62ఫిర్యాదులు

**బలగం టీవీ, హైదరాబాద్**

సోమవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో 62 ఫిర్యాదులు వచ్చాయి. ఉయం జీహెచ్ఎంసీ కమిషనర్ వీఆర్ కర్ణన్ నేరుగా ఆర్జీలను స్వీకరించారు. వాటిని వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఆదనపు కమిషనర్లు కే.సత్యనారాయణ, ఎన్.రవికిణ్, చీఫ్ ఇంజనీర్ సహదేవ్ రత్నాకర్, చీఫ్‌సిటీ ప్లానర్ కే.శ్రీనివాస్‌తోపాటురమాదేవి, వీ.వెంకటేశ్వర్‌రావు,ఎస్.జయంత్, రజనీకాంత్ రెడ్డి పాల్గొన్నారు.

# 'ఎంఎంసీ' ప్రజావాణికి 27 వినతులు

**బలగం టీవీ, హైదరాబాద్**

తార్నాకలోని మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 27 వినతులు అందాయి. కమిషనర్ టి.వినయ్ కష్ణా రెడ్డి ప్రజలను నేరుగా కలిసి వారి సమస్యలు, వినతులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత విభాగాల అధికారులు కూడా పాల్గొని సమస్యలను పరిశీలించారు. మొత్తం 27 వినతిపత్రాలు అందగా, వాటిని సంబంధిత విభాగాలకు పంపించి తక్షణ పరిష్కారం కోసం కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో మున్సిపల్ కార్పొరేషన్ కట్టుబడి ఉందనీ, వాటి పరిష్కారం వరకు నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తామని కమిషనర్ తెలిపారు. ప్రజావాణిలో ఇంజినీరింగ్ విభాగానికి 6, టౌన్ ప్లానింగ్ విభాగానికి 18, ఎఫ్ అండ్ ఏ విభాగానికి 1, రెవెన్యూ విభాగానికి 1, అడ్మిన్ విభాగానికి 1 వినతులు వచ్చాయి. కార్పొరేషన్ ప్రజా సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉందని అధికారులు తెలిపారు.

# పేదల మధ్య చంద్రబాబు పుట్టినరోజు వేడుకలు

**అన్న క్యాంటీన్‌లో భువనేశ్వరితో కలిసి అల్పాహారం వడ్డన.. రూ. 76 లక్షల భారీ విరాళం**

**ఏ ఒక్కరూ ఆకలితో అలమటించకూడదే లక్ష్యం: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు**

**బలగం టీవీ, విజయవాడ**



ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన 76వ పుట్టినరోజును పేదల మధ్య నిరాడంబరంగా జరుపుకున్నారు. పుట్టినరోజు వేడుకల కోసం ఆడంబరాలకు వెళ్లకుండా, విజయవాడలోని పటమటలో ఉన్న 'అన్న క్యాంటీన్'ను ఆయన సందర్శించారు. తన అర్ధాంగి నారా భువనేశ్వరితో కలిసి క్యాంటీన్‌కు వచ్చిన బాబు, అక్కడ అల్పాహారం కోసం వేచి ఉన్న సామాన్యులకు స్వయంగా వడ్డించారు. అనంతరం భువనేశ్వరితో కలిసి వారితో పాటే కూర్చుని అల్పాహారం స్వీకరించి, ఆప్యాయంగా పలకరించారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో పేదలెవరూ ఆకలితో బాధపడకూడదనేదే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. "గత ప్రభుత్వం పేదలపై ఉన్న కడుపుమంటతో అన్న క్యాంటీన్లను దుర్మార్గంగా మూసివేసింది. అన్నం పెట్టే వారిపై కూడా కేసులు పెట్టి వేధించింది. ఇది వారి సంకుచిత మనస్తత్వానికి నిదర్శనం" అని ధ్వజమెత్తారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 269 అన్న క్యాంటీన్లు దిగ్విజయంగా నడుస్తున్నాయని, మరో 5 క్యాంటీన్లు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయని ఆయన వివరించారు. కేవలం రూ. 5కే నాణ్యమైన ఆహారం లభిస్తుండటంపై పేదలు, కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు.

**భువనేశ్వరి స్ఫూర్తిదాయక విరాళం**

అన్న క్యాంటీన్లను కేవలం ప్రభుత్వ పథకంగానే కాకుండా, ఒక సామాజిక ఉద్యమంగా మార్చాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. ఈ మహత్తర కార్యంలో దాతలు స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని కోరారు. తన భార్య నారా భువనేశ్వరి ఈ దిశగా గొప్ప నిర్ణయం తీసుకున్నారని ప్రశంసించారు. తన 76వ పుట్టినరోజు పురస్కరించుకుని, రాష్ట్రంలోని అన్ని అన్న క్యాంటీన్ల ఒకరోజు నిర్వహణ ఖర్చు నిమిత్తం భువనేశ్వరి రూ. 76 లక్షలను విరాళంగా అందించారని వెల్లడించారు. భువనేశ్వరి తీసుకున్న ఈ నిర్ణయం తనకెంతో గర్వకారణమని, ఇది ఎందరికో స్ఫూర్తినిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

**కార్మికులతో ఆత్మీయ ముఖాముఖి**

క్యాంటీన్ వద్ద భోజనానికి వచ్చిన ఆటో డ్రైవర్లు, దినసరి కూలీలతో చంద్రబాబు కాసేపు ముచ్చటించారు. భోజనం నాణ్యత ఎలా ఉంది? కడుపు నిండా తింటున్నారా? అని ఆరా తీశారు. ఇతర సంక్షేమ పథకాలు తమకు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి తమ మధ్యకు వచ్చి సాదాసీదాగా కూర్చుని భోజనం చేయడంపై అక్కడి ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. ఏదేమైనా, ఒక ముఖ్యమంత్రి హోదాలో ఉండి పుట్టినరోజును సామాన్యుల మధ్య జరుపుకోవడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.



# ఏసు విగ్రహం ధ్వంసంపై నెతన్యాహూ విచారం!

**సైనికుడి చర్యను తీవ్రంగా ఖండించిన ఇజ్రాయిల్ ప్రధాని**

**మత సహనానికి విరుద్ధమంటూ వ్యాఖ్య.. బాధిత క్రైస్తవులకు బహిరంగ క్షమాపణ**

**బలగం టీవీ, టెల్ అవీవ్**

దక్షిణ లెబనాన్‌లో ఇజ్రాయెల్ రక్షణ దళం చేపట్టిన గ్రౌండ్ ఆపరేషన్ సందర్భంగా చోటుచేసుకున్న ఒక వివాదాస్పద ఘటనపై ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమన్ నెతన్యాహూ తీవ్రంగా స్పందించారు. ఓ క్యాథలిక్ మతానికి చెందిన ఏసు క్రీస్తు విగ్రహాన్ని ఇజ్రాయెలీ సైనికుడు ధ్వంసం చేయడంపై ఆయన దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ చర్యను అత్యంత కఠినమైన రీతిలో ఖండిస్తున్నట్లు తన 'ఎక్స్' (ట్విట్టర్) ఖాతా ద్వారా వెల్లడించారు.

దక్షిణ లెబనాన్‌లోని ఒక చర్చి సమీపంలో శిలువ వేసిన ఏసు క్రీస్తు విగ్రహాన్ని ఒక ఐడీఎఫ్ సైనికుడు పగులగొడుతున్నట్లు ఉన్న ఫోటో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఇది ప్రపంచవ్యాప్తంగా ఉన్న క్రైస్తవ మతస్తుల మనోభావాలను దెబ్బతీసింది. ఇప్పటికే ఈ ఘటనపై ఇజ్రాయెల్ రక్షణ శాఖ, విదేశాంగ మంత్రి క్షమాపణలు చెప్పగా, తాజాగా ప్రధాని స్వయంగా స్పందించడం ప్రాధాన్యత సంతరించుకుంది.

మత సహనానికి విరుద్ధంగా వ్యవహరించిన సదరు సైనికుడిపై మిలిటరీ అధికారులు ఇప్పటికే విచారణ చేపట్టినట్లు నెతన్యాహూ తెలిపారు. బాధ్యులపై కఠినమైన క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. తమ నేల పైన, తమ ప్రభావం ఉన్న ప్రాంతాల్లో అన్ని మతాలు సమానంగా వర్ధిల్లుతాయని, వివిధ విశ్వాసాలను ఆదరించడం తమ సంస్కృతిలో భాగమని ఆయన పేర్కొన్నారు.

ఈ సందర్భంగా పశ్చిమాసియాలోని ఇతర దేశాల పరిస్థితులను నెతన్యాహూ ప్రస్తావించారు. "సిరియా, లెబనాన్ వంటి దేశాల్లో క్రైస్తవులు దాడులకు గురవుతున్నప్పటికీ, ఇజ్రాయెల్‌లో మాత్రం వారి జనాభా, జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయి. పశ్చిమాసియాలో క్రైస్తవులకు పూర్తి మత స్వేచ్ఛ ఉన్న ఏకైక దేశం ఇజ్రాయెల్ మాత్రమే" అని ఆయన స్పష్టం చేశారు. ఈ అనుకోని ఘటన వల్ల లెబనాన్‌తో పాటు ప్రపంచవ్యాప్తంగా ఎవరి మనోభావాలైనా దెబ్బతింటే, వారికి తాను హృదయపూర్వక క్షమాపణలు చెబుతున్నానని నెతన్యాహూ రాశారు. యుద్ధం తీవ్రస్థాయిలో ఉన్న తరుణంలో ఇలాంటి మతపరమైన అంశాలు మరింత వివాదాస్పదం కాకుండా ఇజ్రాయెల్ ప్రభుత్వం ముందస్తుగా దిద్దుబాటు చర్యలకు దిగడం గమనార్హం.

# రేవంత్ సర్కార్‌తోనే విద్యాభివృద్ధి

- త్వరలో ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం.. పాఠశాలల్లో బ్రేక్ ఫాస్ట్
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

రాష్ట్రంలో విద్యా వ్యవస్థను బలోపేతం చేసి, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయడమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యమని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా సంక్షేమ వారోత్సవాలను ముస్తాబాద్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో కిచెన్ అండ్ శానిటేషన్ డ్రైవ్ కార్యక్రమాన్ని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ కలిసి సోమవారం ప్రారంభించారు. కిచెన్, డైనింగ్ హాల్ ఆవరణ, ఫ్రీజర్లు పరిశీలించారు.



ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. విద్యాశాఖ బాధ్యతలను స్వయంగా ముఖ్యమంత్రి పర్యవేక్షిస్తున్నారని, విద్యార్థుల సౌకర్యార్థం డైట్ ఛార్జీలను 40 శాతం, కాస్మొటిక్ ఛార్జీలను 200 శాతం పెంచినారని అన్నారు. నాణ్యమైన భోజనంతో పాటు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్, స్కిల్ మరియు స్పోర్ట్స్ యూనివర్సిటీలను ప్రభుత్వం అందుబాటులోకి తెస్తోందని అన్నారు. త్వరలోనే ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని, పాఠశాల విద్యార్థులకు ఉదయం బ్రేక్ ఫాస్ట్ సౌకర్యాన్ని కల్పించనున్నదని అన్నారు.

**నిరంతర పర్యవేక్షణలో వసతి గృహాలు: కలెక్టర్ గరిమ అగ్రవాల్**

జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. సంక్షేమ వారోత్సవాల్లో భాగంగా జిల్లాలోని అన్ని రెసిడెన్షియల్ పాఠశాలలు, హాస్టళ్లకు ప్రత్యేక అధికారులను నియమించినట్లు తెలిపారు. ఈ అధికారులు వసతి గృహాలను సందర్శించి, విద్యార్థులతో కలిసి భోజనం చేస్తూ అక్కడి పరిస్థితులపై నివేదికలు అందజేస్తారని అన్నారు . ఇప్పటికే జిల్లాలో పారిశుధ్య, ఆరోగ్య వారోత్సవాలు విజయవంతంగా పూర్తి చేశామని, రోడ్డు భద్రతపై డ్రైవర్లకు శిక్షణ కూడా ఇప్పించామని అన్నారు.

వసతి గృహాల్లో వంటగదుల ఆధునీకరణ, పారిశుధ్య పనులతో పాటు విద్యార్థులకు పోషక విలువలు అందేలా ఫ్రీజర్ల సౌకర్యం కల్పించినట్లు అన్నారు. విద్యార్థులు చదువుపై శ్రద్ధ పెట్టి ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడాలని,త్వరలో చేపట్టబోయే 'బడిబాట' కార్యక్రమాన్ని అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి జగన్ మోహన్ రెడ్డి, ఉపాధి కల్పన అధికారి రాఘవేందర్, తహసీల్దార్ ఫరూఖ్, ఎంపీడీవో లచ్చాలు, ఫుడ్ ఇన్స్పెక్టర్ అనూష, జీసీడీఓ పద్మజ, సర్పంచ్ వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అన్నదాతకు అండగా.. అభాగ్యుడికి నీడగా మన ప్రభుత్వం...



- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**బలగం టీవీ, వేములవాడ:**

రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఒకవైపు అన్నదాతకు వెన్నుదన్నుగా నిలుస్తూనే, మరోవైపు అభాగ్యులైన నిరుపేదలకు సొంతింటి నీడను కల్పిస్తూ ప్రజాపాలన సాగిస్తోందని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. సోమవారం వేములవాడ రూరల్ మండలంలోని వెంకటంపల్లి, మర్రిపల్లి గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల గృహప్రవేశ కార్యక్రమాలకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. నూతన గృహాల్లోకి ప్రవేశిస్తున్న లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపి, వారికి నూతన వస్త్రాలను అందజేశారు.

ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ఇందిరమ్మ రాజ్యంలో పేదల సంక్షేమమే పరమావధిగా పాలన సాగుతోందని అన్నారు. ఎన్నికల వేళ ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని తమ ప్రభుత్వం తూచా తప్పకుండా అమలు చేస్తోందని అన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, సన్న బియ్యం పంపిణీ, కొత్త రేషన్ కార్డుల జారీ మరియు ఆరోగ్యశ్రీ పరిమితిని రూ. 10 లక్షలకు పెంచడం వంటి చర్యలు పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయని అన్నారు .దేశంలో మరెక్కడా లేని విధంగా ఒక ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం ఐదు లక్షల రూపాయల భారీ ఆర్థిక సాయం అందజేస్తోందని, దీనివల్ల పేదల సొంతింటి కల నెరవేరుతోందని తెలిపారు. గృహప్రవేశం చేసుకుంటున్న లబ్ధిదారుల వద్దకు స్వయంగా వచ్చి వారి సంతోషంలో భాగస్వామ్యం కావడం ప్రభుత్వ బాధ్యతగా భావిస్తున్నామని అన్నారు. రైతు సంక్షేమంపై తమ ప్రభుత్వ నిబద్ధతను చాటుతూ.. ఇప్పటికే ఒకే విడతలో రూ. 2 లక్షల వరకు రుణమాఫీని విజయవంతంగా పూర్తి చేశామని అన్నారు . రైతులకు ఇబ్బంది కలగకుండా గ్రామగ్రామాన కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని, ఇప్పటికే ఎకరం లోపు రైతులకు రైతు భరోసా నిధులు అందాయని తెలిపారు. కాటారంలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభ ద్వారా మరిన్ని రైతు భరోసా నిధులను విడుదల చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ప్రభుత్వ అధికారులు మరియు పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.

## విస్తృత సదుపాయాలతో ప్రజలకు పారదర్శకమైన సేవలందించాలి



- రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

**బలగం టీవీ, తంగళ్ళపల్లి:**

విస్తృత సదుపాయాలతో ప్రజలకు పారదర్శకమైన సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. సోమవారం తంగళ్ళపల్లి తహసీల్దార్ కార్యాలయానికి కేటాయించిన నూతన భవనాన్ని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ గడ్డం స్వరూప రెడ్డితో కలిసి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ప్రారంభించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. పాత భవనంలో కొనసాగుతున్న కార్యాలయాన్ని విశాలమైన, ఆధునిక సదుపాయాలతో కూడిన నూతన భవనంలోకి మార్చడం వల్ల ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి అనుకూల వాతావరణం ఏర్పడుతుందని తెలిపారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ కార్యాలయాలను మరింత ప్రజానుకూలంగా తీర్చిదిద్దడం ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ప్రజలకు అందించే ప్రతి సేవలో పారదర్శకత ఉండాలని, ఫైళ్లను ఆలస్యం చేయకుండా వేగంగా పరిష్కరించాలని రెవెన్యూ అధికారులకు స్పష్టం చేశారు. ప్రజలు కార్యాలయానికి వచ్చినప్పుడు ఎలాంటి ఇబ్బందులు లేకుండా, సమయపాలనతో సేవలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విస్తృత స్థలంతో, సౌకర్యవంతమైన వాతావరణంతో ఈ నూతన కార్యాలయం ద్వారా ప్రజలు సులభంగా తమ పనులను పూర్తి చేసుకునే అవకాశం లభిస్తుందని తెలిపారు. కార్యాలయ సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించి, ప్రజలకు సకాలంలో సేవలు అందించేందుకు కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వంపై ప్రజల నమ్మకాన్ని పెంపొందించే విధంగా ప్రతి అధికారి పని చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల ఆర్డీఓ వెంకటేశ్వర్లు, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ నర్సింగం, తహసీల్దార్ విజయ ప్రకాష్ రావు, ఎంపీడీఓ లక్ష్మీనారాయణ, వివిధ గ్రామాల సర్పంచులు, తదితరులు పాల్గొన్నారు.



## సమస్యల పరిష్కారానికే ప్రజావాణి: కలెక్టర్ గరిమ అగ్రవాల్

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

సమస్యల పరిష్కారానికే ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో సోమవారం ప్రజావాణి నిర్వహించగా, జిల్లా కలెక్టర్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రజావాణికి మొత్తం 218 దరఖాస్తుల రాగా, వాటిని సంబంధిత శాఖల అధికారులకు అందజేసి.. వాటిని పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజావాణిలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, సిరిసిల్ల, వేములవాడ ఆర్డీఓలు వెంకటేశ్వర్లు, రాధాభాయి, హౌసింగ్ పీడీ వెంకట మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

## కుల రహిత సమాజమే బసవేశ్వర మహారాజ్ ఆశయం..

- అదనపు కలెక్టర్ గడ్డం నగేష్

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

సమాజంలో కుల వ్యవస్థను, వర్ణభేదాలను మరియు లింగ వివక్షను సమూలంగా వ్యతిరేకించిన గొప్ప అభ్యుదయవాది శ్రీ బసవేశ్వర మహారాజ్ అని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ అన్నారు . సోమవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో బసవేశ్వర మహారాజ్ జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మరియు ఇతర అధికారులు బసవేశ్వర మహారాజ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ అభివృద్ధి అధికారి ఎం. సౌజన్య, రాష్ట్ర మహిళా కార్యదర్శి కాకరకాయల మంజుల, గౌరవ అధ్యక్షులు ఆకుల రాములు, అధ్యక్షులు చిట్టి శోం కుమార్, ఉపాధ్యక్షులు కడెం శివ ప్రసాద్, జనరల్ సెక్రటరీ పత్తి స్వామి, ప్రధాన కార్యదర్శి సొల్లేటి చంద్రమౌళి పాల్గొన్నారు.



## సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక కార్యాచరణ..



- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

రాష్ట్రంలో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను సత్వరమే పూర్తి చేసి, రైతులకు సాగునీరు అందించేందుకు సి ఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతున్నారని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. సోమవారం రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం నామాపూర్ గ్రామంలో రూ. 31 లక్షల ఎస్డీఎఫ్ నిధులతో నిర్మించిన ఉప కార్య నిర్వహక ఇంజనీర్, ఇరిగేషన్ సబ్ డివిజన్ నెంబర్ -- 4 కార్యాలయ భవనాన్ని సోమవారం ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరై ప్రారంభించారు.?

ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. రైతును రాజు చేయడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు. సాగునీటి రంగంలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని, అందులో భాగంగానే రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు వీలుగా నీటి పారుదల శాఖకు పక్కా భవనాలను నిర్మిస్తున్నట్లు తెలిపారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక ద్వారా ప్రభుత్వం ఇప్పటి వరకు చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే కాకుండా, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలు రచిస్తున్నామని అన్నారు. జిల్లాలో ఇప్పటికే పారిశుధ్యం, విద్యార్థులకు వైద్య పరీక్షలు వంటి అనేక కార్యక్రమాలు నిర్వహించామని, సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం ముందడుగు వేస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, సిరిసిల్ల కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జ్ కేకే మహేందర్ రెడ్డి, జిల్లా నీటి పారుదల శాఖ అధికారి కిశోర్ కుమార్, తహసీల్దార్ ఫరూఖ్, ఎంపీడీవో లచ్చాలు, సర్పంచ్ అనిల్ మరియు ఇతర అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## పెద్దపల్లి జిల్లాలో దారుణం..

### వీధికుక్కల దాడిలో మూడేళ్ల చిన్నారి మృతి

**బలగం టీవీ, పెద్దపల్లి**

పెద్దపల్లి జిల్లాలో హృదయ విదారక ఘటన చోటుచేసుకుంది. జిల్లాలోని సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి గ్రామంలో వీధికుక్కల దాడిలో మూడేళ్ల చిన్నారి దుర్మరణం చెందింది.

దివ్యా బెహ్రా అనే బాలిక తమ ఇంటి ముందున్న వీధిలో ఆడుకుంటుండగా అకస్మాత్తుగా వీధికుక్కలు ఆమెపై దాడి చేశాయి. బాలికను నోట కరుచుకుని సమీపంలోని పొలాల వైపు ఈడ్చుకెళ్లిన కుక్కలు దారుణంగా గాయపరిచాయి. తీవ్ర గాయాలతో బాలిక అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం. చిన్నారి తల్లిదండ్రులు ఒడిశా రాష్ట్రానికి చెందినవారు కాగా, జీవనోపాధి కోసం ఇక్కడికి వచ్చి ఇటుక బట్టీల్లో పని చేస్తున్నారు. ఈ ఘటనతో బాధిత కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది. గ్రామంలో వీధికుక్కల బెడద ఎక్కువగా ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. ఈ ఘటనతో కాట్నపల్లి గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది.

## సిరిసిల్లలో నేడు మినీ జాబ్ మేళా...

### జిల్లా ఉపాధి కల్పనాధికారి నీల రాఘవేందర్..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు ప్రైవేట్ కంపెనీలలో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఈనెల 21వ తేదీన జిల్లా ఉపాధి కార్యాలయంలో మినీ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి నీల రాఘవేందర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఈ సందర్భంగా జిల్లా ఉపాధి కల్పనాధికారి నీల రాఘవేందర్ మాట్లాడుతూ.. ఈ జాబ్ మేళా ద్వారా ప్రముఖ సంస్థలైన ఆపరేల్ పార్క్‌లో ట్రైనీ టైలరింగ్ (మహిళలకు మాత్రమే), ఫోన్ పే, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ వంటి సంస్థల్లో ఫీల్డ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్ మరియు అసోసియేట్ పోస్టులతో పాటు హైదరాబాద్‌లోని జియో ఫైబర్‌లో ఇంజనీర్ పోస్టులకు నియామకాలు చేపట్టనున్నారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ లేదా డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు ఈ మేళాకు అర్హులని,ఎంపికైన వారికి నెలకు రూ. 15,000 నుండి రూ. 20,000 వరకు వేతనం అందుతుందని తెలిపారు . ఆసక్తి గల అభ్యర్థులు తమ బయోడేటా మరియు విద్యార్హత ధృవీకరణ పత్రాల జిరాక్స్ కాపీలతో ఏప్రిల్ 21, గురువారం ఉదయం 11:00 గంటలకు సిరిసిల్లలోని జిల్లా ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో హాజరుకావాలని అన్నారు. మరిన్ని వివరాల కోసం 8686416834, 9885346768, 9010312496 లేదా 6301018213 నంబర్లలో సంప్రదించాలని నిరుద్యోగులకు సూచించారు.

## లిఫ్ట్ ఇచ్చాడు.. నిలువునా ముంచాడు..

- ముస్తాబాద్‌లో కలకలం.. బాధితురాలిని తోసేసి నగలతో పరార్

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**



అపరిచితులను నమ్మి వాహనం ఎక్కిన ఒక మహిళ చివరకు నిలువు దోపిడీకి గురైంది. లిఫ్ట్ ఇచ్చే నెపంతో బైక్‌పై ఎక్కించుకుని, నిర్మానుష్య ప్రాంతంలో ఆమెపై దాడి చేసి బంగారు ఆభరణాలతో ఉడాయించిన ఘటన ముస్తాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఆవునూరు గ్రామానికి చెందిన బాధితురాలు ముస్తాబాద్‌కు వెళ్లేందుకు రోడ్డుపై వేచి ఉండగా, ఒక అపరిచిత వ్యక్తి ద్విచక్ర వాహనంపై వచ్చి ఆమెను ఎక్కించుకున్నాడు. అయితే మార్గమధ్యలో వెంకయ్యకుంట గ్రామ శివారులోని కోళ్ల ఫామ్ వద్దకు చేరుకోగానే నిందితుడు తన వక్రబుద్ధిని ప్రదర్శించాడు. చుట్టుపక్కల ఎవరూ లేని సమయం చూసి బండి ఆపి, బాధితురాలిని బెదిరించాడు. ఆమె ధరించిన పుస్తె మట్టెలు, చెవిపోగులు, ముక్కు పోగులు వంటి విలువైన బంగారు ఆభరణాలను బలవంతంగా లాక్కున్నాడు. అనంతరం ఆమెను అక్కడే తోసేసి వేగంతో పరారయ్యాడు. బాధితురాలి ఆర్తనాదాలు విన్న స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. నిందితుడి ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలను రంగంలోకి దించినట్లు పోలీసులు తెలిపారు. అపరిచితులను నమ్మి వాహనాలు ఎక్కవద్దని ప్రజలను హెచ్చరించారు.



## తంగళ్ళపల్లిలో ఉచిత వైద్య శిబిరం విజయవంతం..

**బలగం టీవీ, తంగళ్ళపల్లి:**

తంగళ్ళపల్లి మండల కేంద్రంలోని మార్కండేయ దేవస్థానంలో కోడి అంతయ్య మరియు ఎన్5 టిజీ టెక్నాలజీ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతంగా ముగిసింది. గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందించాలన్న సత్సంకల్పంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో కంటి మరియు పంటి సంబంధిత పరీక్షలు నిర్వహించారు. తంగళ్ళపల్లితో పాటు పరిసర గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి వైద్య నిపుణుల సలహాలు, సేవలను సద్వినియోగం చేసుకున్నారు.?

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గ్రామ సర్పంచ్ మోర లక్ష్మీ రాజం మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం ఎంతో అభినందనీయమని ప్రశంసించారు. ముఖ్యంగా కోడి అంతయ్య మరియు ఎన్5 టిజీ టెక్నాలజీ సంస్థ చైర్మన్ అంకారపు రవి, ఎండీ హఫీజ్ మార్గదర్శకత్వంలో జరుగుతున్న సేవా కార్యక్రమాలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని, యువత ఇలాంటి సేవా దృక్పథంతో ముందుకు రావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కోడి అంతయ్య మాట్లాడుతూ.. ప్రజలందరికీ సేవ చేయాలనే ఉద్దేశంతోనే ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశామని, తనకు సహకరించిన ఎన్5టీజీ సంస్థకు మరియు విచ్చేసిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు.? ఈ శిబిరంలో శ్రీ వెంకటేశ్వర కంటి ఆసుపత్రి వైద్యులు డాక్టర్ భానుచందర్, ఆపిల్ డెంటల్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ డి. శ్యాంసుందర్ రెడ్డి తమ బృందంతో కలిసి రోగులకు వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఆసాని శ్రీకాంత్ రెడ్డి, నేరెళ్ల నర్సింగం గౌడ్, అంకారపు రవీందర్, గజబింకర్ రాజన్న తదితరులతో పాటు గ్రామ పెద్దలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




## టీపీటీఎఫ్ రాష్ట్ర విద్యా సదస్సును విజయవంతం చేయండి

- టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చకినాల అనిల్ కుమార్

**బలగం టీవీ, వేములవాడ:**

తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 30వ తేదీన హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్న రాష్ట్ర విద్యా సదస్సుకు ఉపాధ్యాయులు భారీ సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చకినాల అనిల్ కుమార్ పిలుపునిచ్చారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మండలం తిప్పాపూర్ ఉన్నత పాఠశాలలో టిపిటిఎఫ్ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు దుమాల రమానాద్ రెడ్డి ప్రధాన కార్యదర్శి విక్కుర్తి అంజయ్య రాష్ట్ర నాయకులు కొలుగూరి కిషన్ రావు ల తో కలిసి టీపీటీఎఫ్ సదస్సు గోడపత్రికను చకినాల అనిల్ కుమార్ ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా అనిల్ కుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వం విద్యారంగం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, విద్య అందరికీ సమానంగా అందకుండా విధానాలు రూపొందిస్తున్నారని అన్నారు. ఎన్నికల హామీ మేరకు విద్యారంగానికి నిధులు కేటాయించకపోగా, వందలాది ప్రభుత్వ పాఠశాలల మూసివేతకు రంగం సిద్ధం చేయడంపై ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ బడుల పరిరక్షణ కోసం, విద్యను ప్రభుత్వ ఆధీనంలోనే ఉంచి నైబర్ హుడ్ కామన్ స్కూల్ విధానాన్ని ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.? విద్యారంగం సంక్షోభంలో ఉందని, పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే విడుదల చేయాలని, పీఆర్సీని ప్రకటించాలని, సీపీఎస్ రద్దు చేసి 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. అలాగే 317 జీవో బాధితులకు న్యాయం చేయాలని, ఎస్జీటీ సర్దుబాటు నిబంధనలు మార్చాలని అన్నారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా పాఠశాల విద్యా సంచాలకులు డాక్టర్ నవీన్ నికోలాస్, ప్రొఫెసర్ ఎం. కోదండరాం, ప్రముఖ విద్యావేత్తలు ప్రొఫెసర్ హరగోపాల్, ప్రొఫెసర్ చింతకింది కాశీం, మరియు సీనియర్ జర్నలిస్ట్ కె. శ్రీనివాస్ వివిధ అంశాలపై ప్రసంగించనున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి లోకిని కిషన్, జిల్లా ఉపాధ్యక్షులు నూగురి దేవేందర్, కెవి రజినీరాణి, జిల్లా కార్యదర్శులు పార్వతి తిరుపతి, మండల బాధ్యులు బొజ్జ కృష్ణ, శ్రీనివాస్, సంజీవ్, శ్రీధర్, మహేష్, భూస రాజేందర్, సంతోష్ చకినాల భాస్కర్, సునీత, జ్యోతి, నీరజ, సోదర సంఘ బాధ్యులు రామ్ గోపాల్, ఉపాధ్యాయులు రమేష్, రాజేశం, అశోక్, మధుసూదన్ రావు, రవి, వెంకటేశం, జీవన్, శరత్, శ్రీనివాస్, బాబు పాల్గొన్నారు.

# నైతిక విలువలతో జీవన విధానాన్ని బోధించిన బసవేశ్వరుడు

- మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి

**బలగం టీవి, హైదరాబాద్**



ప్రజలకు సమానత్వం సామాజిక న్యాయం నైతిక విలువలతో కూడిన జీవన విధానాన్ని బోధించిన మహనీయుడు మహాత్మా బసవేశ్వరుడు అని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సోమవారం రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహాత్మ బసవేశ్వర 893వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బసవేశ్వర విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ బసవేశ్వర భవన నిర్మాణానికి త్వరలో శంకుస్థాపన చేయనున్నట్లు ప్రకటించారు. బసవేశ్వరుడి ఆశయాలను భవిష్యత్తు తరాలకు తెలియజేయడంలో ప్రభుత్వమే కాదు బసవేశ్వర వారసులు కూడా భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. బసవేశ్వరుని సంకల్పంతో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర ద్వారా ముందుకు కదిలారని గుర్తు చేశారు. మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ఇంకా కొన్ని అసమానతలు, వివక్షతలు కొనసాగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వం బసవేశ్వర ఆశయాలకు అనుగుణంగా సమాజంలో అన్ని వర్గాల సంక్షేమం కోసం కట్టుబడి ఉందని తెలిపారు. బసవేశ్వర బోధనలు కేవలం పుస్తకాలకే పరిమితం కాకుండా వాటిని ఆచరణలో పెట్టాలని సూచించారు. ఎంపీ సురేష్ షెట్కర్ మాట్లాడుతూ బసవ కార్పొరేషన్‌కు నిధులు కేటాయించాలని, భవన నిర్మాణం కోసం రూ.10 కోట్లను ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అంతకుముందు ట్యాంక్ బండ్ నుంచి రవీంద్రభారతి వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్, మాజీ ఎంపీ బీబీ పాటిల్, మత్స్యశాఖ కార్పొరేషన్ ఛైర్మెన్ మెట్టు సాయి కుమార్, బీసీ కార్పొరేషన్ ఛైర్మెన్ నూతి శ్రీకాంత్ గౌడ్, బీసీ సంక్షేమ శాఖ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి బాల మాయాదేవి, రాష్ట్ర వీరశైవ లింగాయత్ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు పటోళ్ల సంగమేశ్వర్‌తోపాటు వివిధ జిల్లాలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.



# బాధితులకు సత్వర న్యాయమే పోలీసుల లక్ష్యం..

- ఎస్పీ మహేష్ బి. గితే

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

బాధితులకు సత్వర న్యాయం అందించడం మరియు వారి సమస్యలను చట్టపరంగా పరిష్కరించడమే లక్ష్యంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నమని ఎస్పీ మహేష్ బి. గితే అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ డే ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి ఎస్పీ మహేష్ బి. గితే స్వయంగా 22 ఫిర్యాదులను స్వీకరించారు. వచ్చిన అర్జీలను పరిశీలించిన ఎస్పీ, వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ ద్వారా ఆదేశాలు జారీ చేశారు. బాధితుల ఫిర్యాదులపై తక్షణమే స్పందించి, క్షేత్రస్థాయిలో విచారణ జరిపి చట్ట ప్రకారం త్వరితగతిన న్యాయం చేయాలని సూచించారు.

ఈ సందర్భంగా ఎస్పీ మహేష్ బి. గితే మాట్లాడుతూ.. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో అధికారులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా ప్రవర్తించాలని స్పష్టం చేశారు. ఫిర్యాదుదారుల వినతులను సావధానంగా విని, వారికి భరోసా కల్పించినప్పుడే పోలీస్ శాఖపై ప్రజల్లో నమ్మకం పెరుగుతుందన్నారు. గ్రీవెన్స్ డే లో అందిన ప్రతి ఫిర్యాదును ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నామని, వాటి పరిష్కార ప్రక్రియను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలు అందిస్తామని అన్నారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకువచ్చేందుకు గ్రీవెన్స్ డే ఒక వేదికలా ఉపయోగపడుతుందని అన్నారు.

# పొగాకు విక్రయ దుకాణాలపై సిటీ పోలీసుల ఉక్కుపాదం

**ఆపరేషన్ సేఫ్ స్కూల్‌లో భాగంగా రూ. 1.10 కోట్ల విలువైన పొగాకు ఉత్పత్తుల సీజ్**

**బలగం టీవి, హైదరాబాద్**

స్నేహితులను చూసికొందరు, సరదాకోసం ఇంకొందరు, చెడు వ్యసనాలతో మరికొందురు విద్యార్థులు, యువకులు మాదకద్రవ్యాల భారినపడుతున్నారు. వీరిని ఆసరాగా చేసుకుని డ్రగ్స్, గంజాయి, ఈసిగరేట్‌తో పాటు ఇతర మాదక ద్రవ్యాలను సరఫరా చేస్తున్న మాఫియాలు రెచ్చిపోతున్నాయి. గుట్టుచప్పుడు కాకుండా మాదకద్రవ్యాలను విద్యార్థులకు సరఫరా చేస్తున్నాయి. ముందుగా సిగరేట్, ఈ సిగరేట్‌తో మొదలైన వారు నికోటిన్‌కు అలవాటు పడి, చివరకు గంజాయి, మాదకద్రవ్యాల వంటి తీవ్రమైన వ్యసనాలకు గురవుతున్నారు. ముఖ్యంగా విద్యాసంస్థల సమీపంలో గుట్కా, సిగరెట్లు తదితర పొగాకు ఉత్పత్తులు సులభంగా లభించడం వల్ల విద్యార్థులు, యువత వాటికి ఆకర్షితులవుతున్నారు. నగరంలో మాదకద్రవ్యాలతోపాటు పోగాకు ఉత్పత్తులను విద్యార్థులకు సరఫరా చేస్తున్న అంశంపై పోలీసులు ఆరా తియ్యగా పలు కేసుల్లో అస్సలు విషయం వెలుగుచూసింది. దాంతో అప్రమత్తమైన పోలీసులు విద్యాసంస్థల పరిసరాలను మాదకద్రవ్యాల రహితంగా మార్చే లక్ష్యంతో చేపట్టిన 'ఆపరేషన్ సేఫ్ స్కూల్' లో భాగంగా ఈ నెల 18 నుంచి విస్తతంగా సోదాలు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా విద్యార్థులు, యువతను డ్రగ్స్ ఊబిలోకి నెడుతున్న విద్యాసంస్థల సమీపంలోని పొగాకు ఉత్పత్తుల విక్రయ దుకాణాలపై ప్రత్యేక దృష్టి సారించారు.

విద్యార్థుల, యువత ప్రాణాలతో చెలగాటమాడుతున్న వారిపై పోలీసులు కఠిన చట్టాలను ప్రయోగించారు. నగర వ్యాప్తంగా సుమారు 5 వేల మందికి పైగా పోలీస్ సిబ్బంది ఏకకాలంలో సోదాల్లో పాల్గొన్నారు. లా అండ్ ఆర్డర్ పోలీసులతో పాటు టాస్క్ ఫోర్స్, నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్, రిజర్వ్ పోలీస్, ప్రత్యేక బందాలు ఈ సోదాల్లో పాల్గొన్నాయి. మూడు రోజుల్లో 567 కేసులను నమోదు చేశారు. సుమారు రూ. 1.10 కోట్ల విలువైన నిషేధిత గుట్కా, సిగరెట్లు, ఇతర పొగాకు ఉత్పత్తులను సీజ్ చేశారు. అత్యధికంగా చార్మినార్ జోన్ పరిధిలో 119 కేసులు నమోదు కాగా, రాజేంద్రనగర్ జోన్‌లో 102, గోల్కొండలో 98 కేసులు నమోదయ్యాయి. అదేవిధంగా ఖైరతాబాద్‌లో 78, సికింద్రాబాద్‌లో 64, జూబ్లీహిల్స్ లో 54, శంషాబాద్ జోన్ పరిధిలో 52 కేసులను పోలీసులు నమోదు చేశారు. పట్టుబడిన ఉత్పత్తులు, దుకాణదారుల నేర తీవ్రతను బట్టి సిగరెట్లు, ఇతర పొగాకు ఉత్పత్తుల చట్టం (సీఓటీపీఏ చట్టం). భారతీయ న్యాయ సంహితలోని సంబంధిత సెక్షన్లు, జువైనల్ జస్టిస్ (జేజే) యాక్ట్ - సెక్షన్ 77 అండ్ 79, ఈ-సిగరెట్ల నిషేధ చట్టం ప్రకారం కేసులు నమోదు చేశారు.

నగరంలో ఎక్కడైనా ఏ దుకాణదారుడైనా మైనర్లకు పొగాకు ఉత్పత్తులను విక్రయిస్తే, వారిపై జువెనైల్ జస్టిస్ యాక్ట్, 2015లోని సెక్షన్ 77 కింద చట్టపరమైన చర్యలను పోలీస్ అధికారులు తీసుకోనున్నారు. పాఠశాలలు, కళాశాలలు లేదా ఇతర విద్యాసంస్థల సమీపంలో ఎవరైనా చట్టవిరుద్ధంగా సిగరెట్లు, గుట్కా, ఈ-సిగరెట్లు లేదా ఇతర పొగాకు ఉత్పత్తులను విక్రయిస్తున్నట్లు గమనిస్తే వెంటనే డయల్ 100కు కాల్ చేయాలని పోలీసులు కోరారు. హైదరాబాద్ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ (హెచ్-న్యూ) ఫోన్ నెంబర్ 8712661601కు సమాచారం అందించాలని సూచించారు.

హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనార్ మాట్లాడుతూ "డ్రగ్స్ రహిత సమాజం కోసం తీసుకుంటున్న చర్యల్లో భాగంగా ఆపరేషన్ సేఫ్ స్కూల్‌ను ప్రారంభించాం. డ్రగ్స్ మహమ్మారికి పొగాకు ఉత్పత్తులే ముఖద్వారం. ఈ ప్రమాదకరమైన గొలుసుకట్టును ప్రాథమిక దశలోనే తుంచేయాలన్నదే 'ఆపరేషన్ సేఫ్ స్కూల్' ముఖ్య ఉద్దేశం. యువత భవిష్యత్తును నాశనం చేసే హక్కు ఎవరికీ లేదు. విద్యార్థులు, యువత భద్రత కోసం ఈ సోదాలు నిరంతరం కొనసాగుతాయి. విద్యాసంస్థల పవిత్రతను దెబ్బతీస్తూ, విద్యార్థుల ఆరోగ్యాన్ని పణంగా పెడుతున్న ఏ ఒక్కరినీ వదిలిపెట్టబోం. చట్టవిరుద్ధ కార్యకలాపాల పట్ల 'జీరో టాలరెన్స్' విధానాన్ని అవలంభిస్తున్నాము. సామాజిక బాధ్యతగా ప్రజలు, ముఖ్యంగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పోలీసులకు సహకరించాలి. విద్యార్థులు, యువత భవిష్యత్తుతో చెలగాటమాడితే కఠిన చర్యలు తప్పవు" అన్నారు.




# మహిళా రిజర్వేషన్ బిల్లుపై బీజేపీ ఉద్దేశపూర్వక ఆలస్యం..

- డీసీసీ అధ్యక్షుడు సయ్యద్ ఖాలిద్ సైపుల్లా

**బలగం టీవి, హైదరాబాద్**

మహిళా రిజర్వేషన్ బిల్లుపై బీజేపీ ఉద్దేశపూర్వకంగా ఆలస్యం చేస్తున్నదని హైదరాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుడు సయ్యద్ ఖాలిద్ సైపుల్లా అన్నారు. గాంధీ భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో బహదూర్‌పురా రాజేష్ కుమార్ పులిపాటి, చాంద్రాయణ గుట్ట బి. నాగేష్, చార్మినార్ మహమ్మద్ ముజీబుల్లా షరీఫ్, మలక్‌పేట్ షేక్ అక్బర్, యాకుత్‌పురా కె. రవి రాజ్ వంటి అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లతో కలిసి ఆయన మాట్లాడారు. మహిళా రిజర్వేషన్ బిల్లుపై కాంగ్రెస్‌పై బీజేపీ "తప్పుడు ప్రచారం" చేస్తోందన్నారు. మహిళల సాధికారత కోసం కాం గ్రెస్ ఎప్పటినుంచో మద్దతు ఇస్తూ కీలక పాత్ర పోషించిందని తెలిపారు. మహిళా రిజర్వేషన్ బిల్లు 2023 సెప్టెంబర్‌లో కాంగ్రెస్, మిత్రపక్షాల మద్దతుతో ఆమోదించబడిందని, అయితే జనగణన, డిలిమిటేషన్ షరతులతో అనుసంధానం చేసి బీజేపీ ఉద్దేశపూర్వకంగా అమలు ఆలస్యం చేసిందని చెప్పారు. కేంద్రానికి నిజమైన ఉద్దేశం ఉంటే 2024 సాధారణ ఎన్నికల ముందు 33 శాతం రిజర్వేషన్ అమలు చేసేవారని తెలిపారు. ప్రస్తుతం డిలిమిటేషన్ ప్రక్రియను మహిళా రిజర్వేషన్ చర్యగా చూపించే ప్రయత్నం జరుగుతోందన్నారు. ఇది ప్రజలను తప్పుదారి పట్టించే చర్య అని ఆయన పేర్కొన్నారు.

డిలిమిటేషన్‌తో దక్షిణ భారత రాష్ట్రాల రాజకీయ ప్రాతినిధ్యం తగ్గే ప్రమాదం ఉందన్నారు. జనాభా వ్యత్యా సాలను ప్రస్తావిస్తూ, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాలు ప్రభావాన్ని కోల్పోయి, ఉత్తర రాష్ట్రాలకు అసమాన లాభం కలుగుతుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ స్థిరమైన వైఖరిని పునరుద్ఘాటిస్తూ, మహిళలకు 33 శాతం రిజర్వేషన్‌కు కాంగ్రెస్ ఎల్లప్పుడూ మద్దతు ఇచ్చిందని తెలిపారు. మహిళా రిజర్వేషన్ కేవలం విధాన అంశం కాకుండా సమానత్వం, న్యాయం, సాధికారతకు సంబంధించినదని అన్నారు. భారతదేశ తొలి మహిళా ప్రధానమంత్రి ఇందిరా గాంధీ, తొలి మహిళా రాష్ట్రపతి ప్రతిభా పాటిల్, అలాగే అనేక మంది మహిళా ముఖ్యమంత్రులు, గవర్నర్లు, మేయర్లు కాంగ్రెస్ నుంచే వచ్చారని ఆయన తెలిపారు. అన్నీ బిసెంట్, సరోజిని నాయుడు, నెల్లీ సెంగుప్తా వంటి నాయకులు కాంగ్రెస్ అధ్యక్షులుగా పనిచేశారని పేర్కొంటూ, బీజేపీ వారి పార్టీలో అలాంటి స్థాయిలో పనిచేసిన ఒక మహిళను చూపగలదా అని ప్రశ్నించారు. స్థానిక సంస్థల్లో 33 శాతం మహిళా రిజర్వేషన్‌ను 73వ, 74వ రాజ్యాంగ సవరణల తో ప్రవేశపెట్టినది కాంగ్రెస్ ప్రభుత్వం అన్నారు. అలాగే ప్రసూతి ప్రయోజనాలు, గహ హింస, ఉద్యోగ ప్రదేశ భద్రతకు సంబంధించిన చట్టాలను కూడా తీసుకువచ్చిందని తెలిపారు.

మహిళలపై జరిగే నేరాల విషయంలో న్యాయం అందించడంలో బీజేపీ విఫలమైందని చెప్పారు. కాంగ్రెస్‌ను నిందించకుండా, న్యాయం అందించడంపై దష్టి పెట్టాలని వారు సూచించారు. కాంగ్రెస్ నాయకులు మహిళా సాధికారతకు తమ కట్టుబాటును పునరుద్ఘాటిస్తూ, మహిళా రిజర్వే షన్ బిల్లును డిలిమిటేషన్‌తో అనుసంధానం చేయకుండా తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా దక్షిణ రాష్ట్రాల న్యాయమైన రాజకీయ ప్రాతినిధ్యాన్ని దెబ్బతీసే ఏ చర్యనైనా కాంగ్రెస్ వ్యతిరేకిస్తుందని తెలిపారు. మహిళల హక్కుల కోసం కాంగ్రెస్ ఎప్పటికీ పోరాడుతుందని, ఈ విషయంలో గందరగోళం సష్టించడం కాకుండా కేంద్రం నిజాయితీగా చర్యలు తీసుకోవాలని కోరారు.

# రైతులకు మద్దతు ధర అందించేందుకు కొనుగోలు కేంద్రాలు..



- కలెక్టర్ గరిమ అగ్రవాల్

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

రైతులు పండించిన ధాన్యానికి ప్రభుత్వ మద్దతు అందించేందుకు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తున్నామని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అన్నారు. ముస్తాబాద్ మండలం గూడెం గ్రామంలో ఐకేపీ ఐకేపీ ఆధ్వర్యంలో, తంగళ్ళపల్లి మండలం తాడూర్ గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ సోమవారం ప్రారంభించారు. కొనుగోలు కేంద్రంలో రైతుల కోసం ఏర్పాటు చేసిన టెంట్, నీటి వసతి పరిశీలించి.. అధికారులకు పలు సూచనలు చేశారు. ధాన్యం తేమ శాతం పరిశీలించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. జిల్లావ్యాప్తంగా రైతుల సౌకర్యం కోసం ఐకేపీ, పీఏసీఎస్, మెప్మా ఇతర శాఖల ఆధ్వర్యంలో మొత్తం 239 కొనుగోలు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. సరైన తేమ వచ్చిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఆదేశించారు. ధాన్యం సేకరణ పై ఇప్పటికే మార్కెటింగ్, పౌర సరఫరాల శాఖ, జిల్లా వ్యవసాయ అధికారి, సహకార శాఖ అధికారి, రైస్ మిల్లర్లు, ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్లతో సమీక్ష సమావేశం నిర్వహించామని అన్నారు . కొనుగోలుకు కావలసిన ఎలక్ట్రానిక్ యంత్రాలు, గన్ని సంచులు అందుబాటులో ఉన్నాయని, వేసవి నేపథ్యంలో రైతుల కోసం టెంట్లు, నీటి వసతి, ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్ పర్సన్లు తలారి రాణి, స్వరూపారెడ్డి, వైస్ చైర్మన్ నర్సింగం, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, సిరిసిల్ల ఆర్డీఓ వెంకటేశ్వర్లు, డీఆర్డీఓ గీత, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి బుచ్చిబాబు, మేనేజర్ నరసింహ, జిల్లా సహకార అధికారి రామకృష్ణ, అఫ్జల్ బేగం, తహసీల్దార్లు ఫరూఖ్, విజయ ప్రకాష్ రావు, ఎంపీడీఓ లచ్చాలు, అదనపు డీఆర్డీఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.




# మాదిగ దళిత క్రైస్తవులకు ఎస్సీ రిజర్వేషన్ వర్తించదు

- హిందూ మాదిగ ఐక్యత నాయకులు

**బలగం టీవి, హైదరాబాద్**

మాదిగ దళిత క్రైస్తవులకు ఎస్సీ రిజర్వేషన్ వర్తించదని హిందూ మాదిగ ఐక్యత నాయకులు అన్నారు. సోమవారం రాంనగర్ చౌరస్తా వద్ద సుప్రీంకోర్టు దళిత క్రిస్టియన్ ఎస్సీ హోదా రద్దు చేయడంపై హిందూ మాదిగలు స్వాగతిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. క్రిస్టియన్‌గా మారి హిందూ ఎస్సీ రిజిస్ట్రేషన్ హక్కులు కావాలని అడగడం నిజమైన హిందూ మాదిగలకు అన్యాయం చేసినట్టవుతుందన్నారు. అన్ని రాజకీయ పార్టీలు ఒక తాటిపైకి వచ్చి పోరాటం చేయాలని కోరారు. విష ప్రచారం చేస్తున్న వార్తలను ఖండిస్తున్నామని తెలిపారు. ఎర్రల సతీష్, గండు వెంకటేష్ ఆధ్వర్యంలో , పెద్దలు కేశవపురం స్వామి , గజ్జల సూర్యనారాయణ , బర్కు కష్ణన్న, గడ్డం నవీన్, హరీశ్ కుమార్, గుండ్ల నరేష్, రోమాల సాయిరాజ్, నర్సింగ్, కొలిపాక మోహన్ , మహేష్ , లడ్డు ,సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# అక్షర విజయానికి అభినందన నీరాజనం

- సీబీఎస్ఈ ఫలితాల్లో డీపీఎస్--పల్లవి

**గ్రూప్ ఘన విజయం**

**బలగం టీవి, హైదరాబాద్**



సీబీఎస్ఈ పదో తరగతి ఫలితాల్లో డీపీఎస్ , పల్లవి గ్రూప్ ఆఫ్ స్కూల్స్ మరోసారి అద్భుత ప్రతిభ చాటాయి. ఈ విద్యాసంస్థలు 100 శాతం ఉత్తీర్ణత సాధించగా, 300 మందికి పైగా విద్యార్థులు 95 శాతానికి పైగా మార్కులు సాధించి విశేష రికార్డు సృష్టించారు.

ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని భాగ్ లింగంపల్లి ఆర్టీసీ కళ్యాణ మండపంలో టాపర్స్ ఫెలిసిటేషన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ హాజరై విద్యార్థులకు పురస్కారాలు అందజేశారు.

**రికార్డు ఫలితాలతో మెరిసిన విద్యార్థులు**

డీపీఎస్, పల్లవి గ్రూప్ విద్యార్థులు ఈ విద్యా సంవత్సరంలో విశిష్ట ఫలితాలు సాధించి విద్యాసంస్థల ప్రతిష్టను మరింత పెంచారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఛైర్మన్ ఎమ్మెల్సీ మల్క కొమరయ్య, సీఈఓ మల్క యశస్వి కలిసి ప్రశంసా పత్రాలు, మెమెంటోలతో సత్కరించారు.




ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, "ఇూా అంటే కేవలం స్కూల్ పేరు కాదు, ఇది ఒక బ్రాండ్" అని పేర్కొన్నారు. డీ అంటే డిసిప్లిన్, పీ అంటే పర్ఫెక్షన్, ఎస్ అంటే సింప్లిసిటీ అని వివరిస్తూ, ఈ విలువలే విద్యార్థుల విజయానికి పునాది అని అన్నారు. సంస్థ ఛైర్మన్ మల్క కొమరయ్య, సీఈఓ మల్క యశస్వి నాయకత్వాన్ని ఆయన ప్రశంసించారు.

విద్యార్థులు పెద్ద కలలు కనడమే కాకుండా వాటిని సాధించేందుకు కృషి చేయాలని సూచించారు. ఆధునిక కాలంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ూక్మీ)పై పట్టు సాధించడం అత్యవసరమని చెప్పారు. సోషల్ మీడియా ప్రభావానికి లోనవకుండా భవిష్యత్ లక్ష్యాలపై దృష్టి పెట్టాలని సూచించారు.

డీపీఎస్, పల్లవి గ్రూప్ ఛైర్మన్ మల్క కొమరయ్య మాట్లాడుతూ, "డ్రీమ్ బిగ్, వర్క్ హార్డ్, స్టే ఫోకస్" అనే మూడు సూత్రాలు విజయానికి మార్గదర్శకాలని అన్నారు. మార్కులకే పరిమితం కాకుండా లక్ష్యంతో చదివితే ఏదైనా సాధ్యమని పేర్కొన్నారు.

సీఈఓ మల్క యశస్వి మాట్లాడుతూ, 100 శాతం ఉత్తీర్ణతతో పాటు భారీగా టాపర్లు రావడం తమ విద్యా విధానానికి నిదర్శనమని చెప్పారు. ఉపాధ్యాయుల కృషి వల్లే ఈ విజయాలు సాధ్యమయ్యాయని అన్నారు.

**నగరవ్యాప్తంగా విజయోత్సాహం**

పల్లవి, డీపీఎస్ బ్రాంచ్‌లు నగరవ్యాప్తంగా 100 శాతం ఫలితాలు సాధించి మరో మైలురాయిని అందుకున్నాయి. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు వేడుకకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ విజయాలతో డీపీఎస్, పల్లవి గ్రూప్ విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన బాటలు వేస్తున్న విద్యాసంస్థలుగా మరోసారి నిలిచాయి.

# నటి అనసూయపై అసభ్యకర పోస్టులు.. వ్యక్తి అరెస్ట్

**బలగం టీవి, హైదరాబాద్**



సోషల్ మీడియా వేదికగా ప్రముఖ నటి, యాంకర్ అనసూయ భరద్వాజ్‌పై అసభ్యకర వ్యాఖ్యలు చేస్తూ వేధింపులకు పాల్పడుతున్న వ్యక్తిని సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు.

వివరాల్లోకి వెళ్తే.. ఇన్‌స్టాగ్రామ్‌లో తనపై అత్యంత అసభ్యకరమైన పోస్టులు పెడుతూ, వ్యక్తిత్వాన్ని కించపరుస్తున్నారంటూ అనసూయ ఇటీవల పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై సాంకేతిక ఆధారాలతో దర్యాప్తు చేపట్టిన పోలీసులు, నిందితుడు నల్గొండ జిల్లాకు చెందిన చంటిగా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. సోషల్ మీడియాలో మహిళల గౌరవానికి భంగం కలిగించినా, వేధింపులకు పాల్పడినా ఐటీ యాక్ట్ కింద కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. వేధింపులపై ధైర్యంగా స్పందించి ఫిర్యాదు చేసిన అనసూయను పలువురు అభినందిస్తున్నారు.

# ఒలింపిక్ విజేత జాధవ్‌కు 'పద్మ' గౌరవం ఏది?

- కేంద్ర ప్రభుత్వంపై బాంబే హైకోర్టు ఆగ్రహం..
- మే 4లోపు నిర్ణయం తీసుకోవాలని ఆదేశం
- తొలి వ్యక్తిగత ఒలింపిక్ పతక విజేతకు దక్కని గుర్తింపు..
- పిల్‌పై ధర్మాసనం కీలక ఉత్తర్వులు



బలగం టీవీ, ముంబై

విశ్వ క్రీడా వేదిక ఒలింపిక్స్‌లో స్వతంత్ర భారత పతాకాన్ని రెపరెపలాడించి, దేశానికి తొలి వ్యక్తిగత పతకాన్ని అందించిన దివంగత రెజ్లర్ ఖాషాబా దాదాసాహెబ్ జాధవ్ (కె.డి. జాధవ్)కు తగిన గుర్తింపు లభించకపోవడంపై బాంబే హైకోర్టు తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. ఆయనకు మరణానంతరం 'పద్మ విభూషణ్' పురస్కారాన్ని ప్రకటించడంలో జరుగుతున్న ఆలస్యంపై కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీసింది. ఈ విషయంలో మే 4వ తేదీలోపు సహేతుకమైన నిర్ణయం తీసుకోవాలని కేంద్ర హోం శాఖకు అల్టిమేటం జారీ చేసింది.

మహారాష్ట్రకు చెందిన ఖాషాబా దాదాసాహెబ్ జాధవ్ 1952లో హెల్సింకీలో జరిగిన ఒలింపిక్స్‌లో కుస్తీ పోటీల్లో కాంస్య పతకం సాధించారు. తద్వారా ఒలింపిక్స్‌లో వ్యక్తిగత పతకం గెలిచిన తొలి భారతీయుడిగా చరిత్ర సృష్టించారు. 1984లో ఆయన మరణించగా, కేంద్ర ప్రభుత్వం 2001లో ఆయనకు 'అర్జున' అవార్డును ప్రకటించింది. అయితే, దేశానికి అంతటి కీర్తి తెచ్చిన జాధవ్‌కు రెండో అత్యున్నత పౌర పురస్కారమైన పద్మ విభూషణ్ ఇవ్వాలని ఆయన కుటుంబ సభ్యులు, క్రీడా ప్రేమికులు దశాబ్దాలుగా కోరుతున్నా కేంద్రం నుంచి స్పందన కరువైంది. కేంద్రం వైఖరితో విసిగిపోయిన 'కుస్తీవీర్ ఖాషాబా జాధవ్ సంస్థ' బాంబే హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేసింది. దీనిపై విచారణ చేపట్టిన జస్టిస్ మాధవ్ జమ్దార్, జస్టిస్ ప్రవీణ్ పాటిల్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం కేంద్ర ప్రభుత్వ తీరును తప్పుబట్టింది. జాధవ్ సాధించిన ఘనతను గుర్తించడంలో మీమాంస ఎందుకని ప్రశ్నించింది.

**కోర్టు ఆదేశాలు**

లి లిలిగడువు:లిలి మే 4వ తేదీ లేదా అంతకంటే ముందుగానే పద్మ విభూషణ్ పురస్కారంపై తుది నిర్ణయం తీసుకోవాలని కేంద్రాన్ని ఆదేశించింది.

రాష్ట్ర ప్రభుత్వ బాధ్యత: ఇందుకు సంబంధించిన అవసరమైన పత్రాలు, సిఫార్సులను సమర్పించాలని మహారాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది.

వాయిదా: తదుపరి విచారణను మే 5వ తేదీకి వాయిదా వేసింది.

ఇటీవలి కాలంలో విశ్వ వేదికపై పతకాలు సాధించిన క్రీడాకారులను కేంద్రం పద్మ పురస్కారాలతో వెంటనే గౌరవిస్తోంది. కానీ, కనీస సౌకర్యాలు లేని కాలంలోనే దేశానికి తొలి పతకం తెచ్చిన జాధవ్‌కు మరణానంతరం కూడా ఈ గౌరవం దక్కకపోవడం శోచనీయమని క్రీడా వర్గాలు పేర్కొంటున్నాయి. కోర్టు ఆదేశాల నేపథ్యంలోనైనా కేంద్రం సానుకూల నిర్ణయం తీసుకుంటుందని ఆశిస్తున్నారు.



# టైటిల్ గెలిచినప్పుడు కూడా ఇన్ని కన్నీళ్లు చూడలేదు

- వరుణ్ చక్రవర్తి

బలగం టీవీ, కోల్‌కతా

ఐపీఎల్ 2026 సీజన్‌లో వరుస పరాజయాలతో సతమతమవుతున్న కోల్‌కతా నైట్‌రైడర్స్ (ఖఖక్ష) ఎట్టకేలకు గెలుపు బాట పట్టింది. ఐదు ఓటముల తర్వాత ఆదివారం రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన ఉత్కంఠ పోరులో కేకేఆర్ 4 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఈ గెలుపు జట్టులో ఎంతటి ఊరటనిచ్చిందంటే.. డ్రెస్సింగ్ రూమ్‌లో ఆటగాళ్లంతా ఉద్వేగానికి లోనై కన్నీళ్లు పెట్టుకున్నారు. 2024లో టైటిల్ నెగ్గినప్పుడు కూడా లేనంత భావోద్వేగం ఈ విజయం తర్వాత కనిపించిందని ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ వరుణ్ చక్రవర్తి పేర్కొన్నాడు.

టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన రాజస్థాన్ రాయల్స్‌ను కేకేఆర్ బౌలర్లు కట్టుదిట్టమైన బౌలింగ్‌తో కట్టడి చేశారు. ఓపెనర్లు వైభవ్ సూర్యవంశీ (46), యశస్వి జైస్వాల్ (39) రాణించినప్పటికీ, మిగిలిన బ్యాటర్లు విఫలమయ్యారు. ముఖ్యంగా వరుణ్ చక్రవర్తి (3/14), కార్తీక్ త్యాగీ (3/22) ప్రత్యర్థి బ్యాటర్లను ముప్పుతిప్పలు పెట్టారు. సీనియర్ స్పిన్నర్ సునీల్ నరైన్ కూడా రెండు వికెట్లు పడగొట్టడంతో రాజస్థాన్ 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 155 పరుగులకే పరిమితమైంది. 156 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన కేకేఆర్ ఆరంభంలో తడబడింది. అయితే, ఫామ్ లేమితో ఇబ్బంది పడుతున్న రింకూ సింగ్ (53 నాటౌట్) కీలక సమయంలో ఆపద్బాంధవుడిలా నిలిచాడు. 34 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సర్లతో హాఫ్ సెంచరీ బాది జట్టును విజయతీరాలకు చేర్చాడు. అతనికి తోడుగా అనుకుల్ రాయ్ (27 నాటౌట్), కామెరూన్ గ్రీన్ (27) మెరుపులు మెరిపించారు. దీంతో కేకేఆర్ 19.4 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది.

మ్యాచ్ అనంతరం వరుణ్ చక్రవర్తి మాట్లాడుతూ.. "ఈ విజయం మాకు ఎంతో ప్రత్యేకం. గాయాల సమస్యలు, వరుస ఓటములతో జట్టుపై ఎన్నో విమర్శలు వచ్చాయి. అభిషేక్ నాయర్ నేతృత్వంలోని కోచింగ్ స్టాఫ్ మమ్మల్ని నిరంతరం ప్రోత్సహించారు. డ్రెస్సింగ్ రూమ్‌లో ప్రతి ఆటగాడు కన్నీళ్లు పెట్టుకున్నాడంటే పరిస్థితి ఎంత క్లిష్టంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. మేనేజ్‌మెంట్ ఇచ్చిన మద్దతు వల్లే మేము తిరిగి పుంజుకోగలిగాం" అని వెల్లడించాడు. హర్షిత్ రాణా, ఆకాశ్ దీప్ వంటి కీలక ఆటగాళ్లు గాయాలతో దూరం కావడం, రింకూ సింగ్ ఫామ్ లేమి వంటి సమస్యల మధ్య కేకేఆర్ సాధించిన ఈ గెలుపు రాబోయే మ్యాచ్‌లకు ఆత్మవిశ్వాసాన్ని ఇస్తుందనడంలో సందేహం లేదు.



# ఫీల్డింగ్‌లో శశాంక్ పొరపాట్లు.. కోపగించుకున్నా చివర్లో అక్కున చేర్చుకున్న పాంటింగ్

బలగం టీవీ, న్యూ చండీగఢ్

ఐపీఎల్ 2026 సీజన్‌లో పంజాబ్ కింగ్స్ జైత్రయాత్ర అప్రతిహతంగా కొనసాగుతోంది. ఆదివారం మహారాజా యాదవీంద్ర సింగ్ స్టేడియంలో జరిగిన హై-స్కోరింగ్ పోరులో పంజాబ్ 54 పరుగుల తేడాతో లక్నో సూపర్ జెయింట్స్‌ను చిత్తు చేసింది. ఈ విజయంతో పంజాబ్ జట్టు పాయింట్ల పట్టికలో అగ్రస్థానాన్ని మరింత సుస్థిరం చేసుకుంది. అయితే, మ్యాచ్ గెలిచినప్పటికీ మైదానంలో కోచ్ రికీ పాంటింగ్ మరియు ఆటగాడు శశాంక్ సింగ్ మధ్య చోటుచేసుకున్న పరిణామాలు ఇప్పుడు క్రీడా వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీశాయి.

మొదట బ్యాటింగ్ చేసిన పంజాబ్ కింగ్స్ నిర్ణీత 20 ఓవర్లలో 254 పరుగుల భారీ స్కోరును సాధించింది. అనంతరం లక్ష్య ఛేదనలో లక్నో సూపర్ జెయింట్స్ తడబడింది. పంజాబ్ బౌలర్ల కట్టుదిట్టమైన బౌలింగ్ ధాటికి లక్నో బ్యాటర్లు క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయారు. చివరకు పంజాబ్ 54 పరుగుల తేడాతో ఘన విజయాన్ని అందుకుంది.

మ్యాచ్ పంజాబ్ చేతుల్లోనే ఉన్నప్పటికీ, ఫీల్డింగ్‌లో శశాంక్ సింగ్ చేసిన పొరపాట్లు డగౌట్‌లో ఉన్న కోచ్ రికీ పాంటింగ్‌కు చెమటలు పట్టించాయి. ఒకే మ్యాచ్‌లో శశాంక్ మూడు సులువైన క్యాచ్‌లను జారవిడిచాడు. ముఖ్యంగా 18వ ఓవర్‌లో అర్ష్‌దీప్ సింగ్ బౌలింగ్‌లో ఐడెన్ మార్క్రమ్ ఇచ్చిన క్యాచ్‌ను అంచనా వేయడంలో శశాంక్ పూర్తిగా విఫలమయ్యాడు. దీంతో బౌలర్ అర్ష్‌దీప్ మైదానంలోనే అసహనం వ్యక్తం చేయగా, క్రమశిక్షణకు మారుపేరైన రికీ పాంటింగ్ కోపంతో ఊగిపోయాడు. కామెంటేటర్లు సైతం దీనిని 'ఫీల్డింగ్ డిజాస్టర్'గా అభివర్ణించారు.

మ్యాచ్ సమయంలో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన రికీ పాంటింగ్, గెలుపు అనంతరం మాత్రం తనలోని అసలైన గురువును చాటుకున్నాడు. మ్యాచ్ ముగిసిన వెంటనే డీలా పడిపోయిన శశాంక్ సింగ్ దగ్గరకు వెళ్లి, అతడిని ఆత్మీయంగా కౌగిలించుకుని ఓదార్చాడు. ఆటలో తప్పులు సహజమని, వాటిని అధిగమించి ముందుకు సాగాలని సూచించాడు. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ కూడా శశాంక్‌ను వెన్నుతట్టి ప్రోత్సహించడం విశేషం. మైదానంలో ఉండే భావోద్వేగాలను అక్కడే వదిలేయాలనే క్రీడా స్ఫూర్తిని పాంటింగ్ ప్రదర్శించడంపై సోషల్ మీడియాలో ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి

# ముంబై 'మహా' గర్జన!

## గుజరాత్ టైటాన్స్‌పై 99 పరుగుల భారీ విజయం
## తిలక్ వర్మ మెరుపు శతకం.. నాలుగు వికెట్లతో అదరగొట్టిన అశ్వని కుమార్



బలగం టీవీ, అహ్మదాబాద్

ఐపీఎల్ 2026 సీజన్‌లో వరుస పరాజయాలతో సతమతమవుతున్న ముంబై ఇండియన్స్ ఎట్టకేలకు ఫామ్‌లోకి వచ్చింది. వరుసగా నాలుగు ఓటముల తర్వాత ఆడిన హార్దిక్ సేన, ఆల్‌రౌండ్ ప్రదర్శనతో గుజరాత్ టైటాన్స్‌ను మట్టికరిపించింది. సోమవారం అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో జరిగిన ఏకపక్ష పోరులో ముంబై 99 పరుగుల భారీ తేడాతో ఘనవిజయం సాధించి తిరిగి రేసులోకి వచ్చింది. తెలుగు తేజం తిలక్ వర్మ (101లి) అజేయ సెంచరీతో ముంబై భారీ స్కోరు సాధించగా, బౌలింగ్‌లో అశ్వని కుమార్ నాలుగు వికెట్లతో గుజరాత్ వెన్నువిరిచాడు.

**తిలక్ వర్మ 'విశ్వరూపం':**

టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ముంబైకి ఆరంభంలోనే షాక్ తగిలింది. ఓపెనర్లు డికాక్ (13), డానిష్ మలేవార్ (2)తో పాటు స్టార్ బ్యాటర్ సూర్యకుమార్ యాదవ్ (15) తక్కువ స్కోర్లకే పెవిలియన్ చేరారు. 44 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి కష్టాల్లో ఉన్న జట్టును తిలక్ వర్మ ఆదుకున్నాడు. నమన్ ధీర్ (45)తో కలిసి నాలుగో వికెట్‌కు 52 పరుగులు జోడించిన తిలక్, ఆ తర్వాత గుజరాత్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. కేవలం 45 బంతుల్లో 8 ఫోర్లు, 7 సిక్సర్లతో 101 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. దీంతో ముంబై నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 199 పరుగుల భారీ స్కోరు చేసింది. గుజరాత్ బౌలర్లలో రబాడా 3 వికెట్లు తీశాడు.

**కుప్పకూలిన గుజరాత్**

200 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన గుజరాత్ టైటాన్స్ కనీస పోరాటం చేయకుండానే చేతులెత్తేసింది. ఇన్నింగ్స్ మొదటి బంతికే సాయి సుదర్శన్‌ను క్లీన్ బౌల్డ్ చేసి స్టార్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా శుభారంభం అందించాడు. ఈ సీజన్లో బుమ్రాకు ఇదే తొలి వికెట్ కావడం విశేషం. అనంతరం యువ బౌలర్ అశ్వని కుమార్ (4/24) తన స్పెల్‌తో గుజరాత్ మిడిలార్డర్‌ను దెబ్బతీశాడు. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (14), జోస్ బట్లర్ (5) పూర్తిగా విఫలమయ్యారు. వాషింగ్టన్ సుందర్ (26) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ముంబై బౌలర్ల ధాటికి గుజరాత్ 15.5 ఓవర్లలో 100 పరుగులకే ఆలౌట్ అయింది.

**బుమ్రా బోణీ.. విమర్శలకు చెక్:**

గత ఐదు మ్యాచ్‌ల్లో ఒక్క వికెట్ కూడా తీయలేక తీవ్ర విమర్శలు ఎదుర్కొన్న జస్ప్రీత్ బుమ్రా, ఈ మ్యాచ్‌తో తిరిగి ఫామ్‌లోకి రావడం ముంబై జట్టుకు పెద్ద ఊరటనిచ్చింది. సాయి సుదర్శన్‌ను డకౌట్ చేయడం ద్వారా అతను తన ఫామ్‌ను చాటుకున్నాడు. అశ్వని కుమార్‌కు తోడుగా మిచెల్ సాంట్నర్, గజన్ఫర్ చెరో రెండు వికెట్లు తీసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు. ఈ భారీ విజయం ముంబై ఆత్మవిశ్వాసాన్ని రెట్టింపు చేసింది.

# క్రికెట్ స్టేడియంలో 'నిమ్మకాయ' మంత్రాలు!

- శివం దూబే వికెట్‌పై సోషల్ మీడియాలో వింత ప్రచారం
- బీసీసీఐకు చెన్నై సూపర్ కింగ్స్ ఫిర్యాదు చేసిందంటూ ఫేక్ లేఖ వైరల్
- లెటర్ ఫేక్ అని తేల్చిన సీఎస్‌కే..
- మూఢనమ్మకాలపై నెటిజన్ల ఆగ్రహం
- అదంతా ఉత్తుత్తిదే.. క్షమించండి : వీడియో చేసిన సన్నీ

బలగం టీవీ, హైదరాబాద్

మైదానంలో ఆటగాళ్ల ప్రతిభ, వ్యూహాలతో సాగాల్సిన క్రికెట్ మ్యాచ్‌లో 'మంత్రాలు-తంత్రాలు' చర్చనీయాంశంగా మారాయి. సన్‌రైజర్స్ హైదరాబాద్ , చెన్నై సూపర్ కింగ్స్ మధ్య జరిగిన పోరులో ఒక అభిమాని చేసిన వింత పని ఇప్పుడు సోషల్ మీడియాలో పెను దుమారం రేపుతోంది. శివం దూబే వికెట్ పడటా నికి ఒక అభిమాని చేసిన 'నిమ్మకాయ మంత్రాలే' కారణమంటూ వస్తున్న వార్తలు క్రీడా వర్గాలను విస్మయానికి గురిచేస్తున్నాయి.

**అసలేం జరిగింది?**

స్టేడియంలో మ్యాచ్ జరుగుతుండగా ఒక ఎస్ఆర్‌హెచ్ అభిమాని చేతిలో నిమ్మకాయ పట్టుకుని, ఏదో మంత్రాలు చదువుతున్నట్లు ఉన్న వీడియో నెటిజన్ల కంటపడింది. విచిత్రంగా ఆ వ్యక్తి మంత్రాలు చదువుతున్న తర్వాతి బంతికే క్రీజులో ఉన్న సీఎస్‌కే బ్యాటర్ శివం దూబే ఔట్ కావడంతో.. ఆ 'మంత్రాల' వల్లే వికెట్ పడిందని మీమ్స్ రాయుళ్లు సోషల్ మీడియాను హోరెత్తిస్తున్నారు. 'బ్లాక్ మ్యాజిక్' అంటూ ఈ వీడియోకు లక్షలాది వ్యూస్ వస్తుండటంతో ఇది కాస్తా చర్చనీయాంశంగా మారింది.

**ఫేక్ లేఖ వైరల్**

ఈ ఘటనపై చెన్నై సూపర్ కింగ్స్ మేనేజ్‌మెంట్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ బీసీసీఐకి ఫిర్యాదు చేసిందంటూ ఒక లేఖ సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టింది. తమ ఆటగాళ్ల ప్రదర్శనను దెబ్బతీసేలా క్షుద్ర పూజలు చేస్తున్నారని, సదరు అభిమానిపై చర్యలు తీసుకోవాలని సీఎస్‌కే డిమాండ్ చేసినట్లు ఆ లేఖలో ఉంది. అయితే, ప్రాథమిక విచారణలో ఆ లేఖ సంపూర్ణంగా నకిలీ అని తేలింది. ఎవరో కావాలనే సీఎస్‌కే లెటర్ హెడ్‌ను ఎడిట్ చేసి ఈ తప్పుడు వార్తను ప్రచారం చేసినట్లు స్పష్టమైంది.

క్రికెట్ అనేది కేవలం టాలెంట్ మరియు ప్రాక్టీస్‌పై ఆధారపడి ఉండే ఆట అని, నిమ్మకాయ మంత్రాలకు వికెట్లు పడవని క్రీడా విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు. దూబే వికెట్ పడటం, ఆ సమయంలో సదరు వ్యక్తి నిమ్మకాయతో కనిపించడం కేవలం యాదృచ్ఛికం మాత్రమేనని పేర్కొంటున్నారు. స్టేడియంలో ఇలాంటి మూఢనమ్మకాలను ప్రోత్సహించడం క్రీడాస్ఫూర్తికి విరుద్ధమని అభిమానులు మండిపడుతున్నారు. ఇది కేవలం సరదా కోసం చేసిన వీడియో మాత్రమేనని తెలుస్తోంది.



**అదంతా ఉత్తుత్తిదే.. క్షమించండి : సన్నీ**

ఎస్ఆర్‌హెచ్ మ్యాచ్‌లో నిమ్మకాయతో మంత్రాలు వేస్తూ సోషల్ మీడియాలో సెన్సేషన్‌గా మారిన ఆ వ్యక్తి ఎట్టకేలకు మీడియా ముందుకు వచ్చారు. ఆ వీడియోలో కనిపిస్తున్న వ్యక్తి పేరు 'సన్నీ' అని, తాను ఒక కంటెంట్ క్రియేటర్‌నని ఆయన వెల్లడించారు. తన వీడియో వల్ల తలెత్తిన వివాదంపై స్పందిస్తూ.. అది కేవలం సరదా కోసం చేసిన పనే తప్ప, దాని వెనుక ఎలాంటి క్షుద్రపూజలు లేవని స్పష్టం చేశారు.

స్టేడియం లోపలికి వాలెట్లు, ఇయర్ బడ్స్‌నే అనుమతించని పోలీసులు, నిమ్మకాయను ఎలా వదిలారన్న సస్పెన్స్‌కు సన్నీ తెరదించారు. "నాకు క్యాబ్ లేదా ఇతర వాహనాల్లో ప్రయాణిస్తే వాంతులు అవుతాయి. ఆ సమస్య రాకుండా ఉండేందుకే నా వెంట నిమ్మకాయను తెచ్చుకున్నాను. గేటు వద్ద పోలీసులు తొలుత అడ్డుకున్నప్పటికీ, నా ఆరోగ్య పరిస్థితిని వివరించి వారిని బతిమిలాడుకుని లోపలికి తీసుకెళ్లాను" అని సన్నీ వివరించారు.

స్టేడియంలోకి వెళ్లాక అప్పటికప్పుడు వచ్చిన ఆలోచనతోనే ఆ రీల్ చేశానని సన్నీ తెలిపారు. "నేను ఆ వీడియోను మొదటిసారి తీయలేదు. శివం దూబే వికెట్ పడకముందు నాలుగు సార్లు వీడియో ట్రై చేశాను. ఐదోసారి నేను మంత్రాలు చదువుతున్నట్లు నటిస్తున్నప్పుడే సరిగ్గా వికెట్ పడింది. అది చూసి నా పక్కనున్న అభిమాని కూడా ఆశ్చర్యపోయారు. ఇంటికి వెళ్లాక ఆ వీడియోను సరదాగా సోషల్ మీడియాలో పెడితే.. తెల్లారేసరికి అది ఇంతలా వైరల్ అవుతుందని ఊహించలేదు" అని పేర్కొన్నారు. ఈ ఘటనపై సన్నీ బహిరంగంగా క్షమాపణలు కోరారు. "బ్లాక్ మ్యాజిక్ వల్లే వికెట్లు పడితే.. రేపటి నుంచి అందరూ జెండాలకు బదులు నిమ్మకాయలే స్టేడియంలోకి తెస్తారు కదా? ఇది కేవలం జనాలను నవ్వించడానికి చేసిన ప్రయత్నం మాత్రమే. నా వల్ల ఎవరైనా బాధపడి ఉంటే క్షమించండి. పోలీసులు సంప్రదించినా ఇదే విషయం చెబుతాను" అని ఆయన స్పష్టం చేశారు. ఒక చిన్న నిమ్మకాయ తన జీవితాన్ని రాత్రికి రాత్రే వైరల్ గా మార్చేస్తుందని అనుకోలేదని సన్నీ పేర్కొన్నారు. ఏదేమైనా, ఒక కంటెంట్ క్రియేటర్ చేసిన ఈ 'ఫన్నీ ప్రయత్నం' ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.




# ప్రకాశ్ రాజ్‌పై పోలీసులకు ఫిర్యాదు

- శ్రీరాముడిపై అనుచిత వ్యాఖ్యలు చేశారని కరాటే కల్యాణి ఆరోపణ
- హిందువుల మనోభావాలు దెబ్బతీశారంటూ పంజాగుట్ట పీఎస్‌లో ఫిర్యాదు.. చర్యలకు డిమాండ్

బలగం టీవీ, హైదరాబాద్

ప్రముఖ నటుడు ప్రకాశ్ రాజ్ మరోసారి వివాదంలో చిక్కుకున్నారు. శ్రీరాముడు, రామాయణంపై ఆయన చేసిన వ్యాఖ్యలు హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా ఉన్నాయని ఆరోపిస్తూ సినీ నటి, బీజేపీ నేత కరాటే కల్యాణి సోమవారం పోలీసులను ఆశ్రయించారు. హైదరాబాద్‌లోని పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో ఆమె ప్రకాశ్ రాజ్‌పై రాతపూర్వక ఫిర్యాదు దాఖలు చేశారు.

కేరళ లిటరేచర్ ఫెస్టివల్‌లో ప్రకాశ్ రాజ్ ప్రసంగిస్తూ రామాయణాన్ని, శ్రీరాముడిని కించపరిచారని కరాటే కల్యాణి తన ఫిర్యాదులో పేర్కొన్నారు. : రామాయణాన్ని బీఫ్ తినడంతో పోల్చడం ద్వారా కోట్లాది మంది హిందువుల విశ్వాసాలను అవమానించారని ఆమె ఆరోపించారు. రాముడు, లక్ష్మణుడు ఉత్తర భారతదేశం నుంచి వచ్చిన వలస కూలీలని, రావణుడు అనే గిరిజన భూస్వామి పొలంలో పండ్లు దొంగిలించారని ప్రకాశ్ రాజ్ వ్యాఖ్యానించినట్లు కల్యాణి తెలిపారు. పండ్లకు డబ్బులు చెల్లించలేదన్న చిన్న గొడవ వల్లే రామాయణ యుద్ధం జరిగిందని చెప్పడం ద్వారా పురాణ ఇతిహాసాన్ని వక్రీకరించారని మండిపడ్డారు. ప్రకాశ్ రాజ్ నడుపుతున్న "నిర్దిగంత" అనే థియేటర్ సంస్థ ద్వారా చిన్న పిల్లల చేత హిందూ వ్యతిరేక నాటకాలు వేయిస్తూ, వారిని తప్పుదోవ పట్టిస్తున్నారని ఆమె తన ఫిర్యాదులో పేర్కొన్నారు.

ప్రకాశ్ రాజ్ వ్యాఖ్యలకు సంబంధించిన వీడియో లింక్‌ను పోలీసులకు అందజేసిన కరాటే కల్యాణి, ఆయనపై భారతీయ న్యాయ సంహిత మరియు ఐటీ చట్టం కింద ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కోరారు. సమాజంలో విద్వేషాలు రేకెత్తించేలా మాట్లాడుతున్న ప్రకాశ్ రాజ్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, సదరు వివాదాస్పద వీడియోలను సోషల్ మీడియా నుంచి తొలగించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన పోలీసులు.. ప్రాథమిక విచారణ జరిపి చట్టప్రకారం ముందుకు వెళ్తామని తెలిపారు. ప్రకాశ్ రాజ్ గతంలోనూ పలు సామాజిక, రాజకీయ అంశాలపై చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమైన సంగతి తెలిసిందే. తాజాగా రామాయణంపై చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లోనూ చర్చకు దారితీస్తున్నాయి.

# భారత అథ్లెటిక్స్‌కు 'డోపింగ్' సెగ!

- ప్రమాదకర 'కేటగిరీ-ఎ' జాబితాలోకి భారత్.. ఏఐయూ సంచలన ప్రకటన
- రష్యా, కెన్యా సరసన చేరిన దేశం.. ఇక నుంచి కఠిన నిబంధనలు అమలు

బలగం టీవీ, హైదరాబాద్




విశ్వ క్రీడా వేదికపై తన ముద్ర వేయాలని ప్రయత్నిస్తున్న భారత్‌కు డోపింగ్ భూతం పెను సవాలుగా మారింది. దేశంలో డోపింగ్ ఉల్లంఘనలు ప్రమాదకర స్థాయికి చేరుకోవడంతో, అంతర్జాతీయ అథ్లెటిక్స్ ఇంటిగ్రిటీ యూనిట్ (ూక్ష్మీఖ) భారత్‌ను అత్యంత అప్రమత్తంగా ఉండాల్సిన 'కేటగిరీ-ఎ' (జుఫ్వస్త్రశీతీఎాూ) దేశాల జాబితాలోకి చేర్చింది. సోమవారం విడుదల చేసిన తాజా నివేదికలో ఈ విషయాన్ని వెల్లడించిన ఏఐయూ, భారత అథ్లెటిక్స్‌లో డోపింగ్ నియంత్రణపై ఆందోళన వ్యక్తం చేసింది.

**కేటగిరీ-బి నుంచి ఎ-కు..**

ఇప్పటి వరకు డోపింగ్ విషయంలో ఓ మోస్తరు నిబంధనలు ఉన్న 'కేటగిరీ-బి'లో కొనసాగిన భారత్, తాజా పరిస్థితుల దృష్ట్యా 'కేటగిరీ-ఎ'లోకి మారింది. దీంతో ఇక నుంచి భారత అథ్లెట్లు అత్యంత కఠినమైన డోపింగ్ నిరోధక నిబంధనలను పాటించాల్సి ఉంటుంది. డోపింగ్ నిరోధక చర్యల్లో వెనుకబడి ఉండి, అత్యధికంగా నిషేధిత ఉద్దీపనల ఉల్లంఘనలు జరిగే దేశాలను ఈ జాబితాలో చేరుస్తారు. ప్రస్తుతం ఈ జాబితాలో రష్యా, కెన్యా, నైజీరియా, ఇథియోపియా, బెలారస్ వంటి దేశాలు ఉన్నాయి. ఇప్పుడు భారత్ కూడా ఆయా దేశాల సరసన చేరడం భారత క్రీడా రంగానికి మింగుడుపడని అంశంగా మారింది.

**రెండేళ్లుగా రికార్డు స్థాయిలో ఉల్లంఘనలు:**

గత మూడేళ్ల కాలంలో అథ్లెటిక్స్‌లో అత్యధిక డోపింగ్ ఉల్లంఘనలు జరిగిన దేశాల జాబితాలో భారత్ మొదటి రెండు స్థానాల్లో నిలిచిందని ఏఐయూ వెల్లడించింది. అనేక మంది అథ్లెట్లు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో నిషేధిత మందులు వాడుతూ పట్టుబడటం భారత్ ప్రతిష్టను దెబ్బతీసింది. శిక్షకులు, అథ్లెట్ల అవగాహన లోపం లేదా వేగంగా ఫలితాలు సాధించాలనే ఆత్రుత ఈ పరిస్థితికి దారితీస్తున్నాయని క్రీడా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

**కఠిన నిబంధనలు ఏమిటంటే?**

కేటగిరీ-ఎ లో చేరడం వల్ల భారత అథ్లెట్లు ప్రపంచ ఛాంపియన్‌షిప్స్ లేదా ఒలింపిక్స్ వంటి పెద్ద టోర్నీల్లో పాల్గొనే ముందు కనీసం మూడు సార్లు 'అవుట్ ఆఫ్ కాంపిటీషన్' డోపింగ్ పరీక్షలకు సిద్ధంగా ఉండాలి. పది నెలల వ్యవధిలో ఈ పరీక్షలు పూర్తి కావాల్సి ఉంటుంది. అంతేకాకుండా, నేషనల్ యాంటీ డోపింగ్ ఏజెన్సీ మరింత కట్టుదిట్టంగా పనిచేయాల్సి ఉంటుంది. ఈ తాజా పరిణామం నేపథ్యంలో భారత అథ్లెటిక్స్ సమాఖ్య మరియు క్రీడా మంత్రిత్వ శాఖ అప్రమత్తమైంది. అట్టడుగు స్థాయి నుంచే అథ్లెట్లకు డోపింగ్ దుష్ప్రభావాలపై అవగాహన కల్పించకపోతే, భవిష్యత్తులో అంతర్జాతీయ వేదికలపై భారత క్రీడాకారుల భాగస్వామ్యం ప్రమాదంలో పడే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.